AL - HILAL

# నెలవంక

మాస పత్రిక


Vol 5, Issue: 32 June - 2009

مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى

## విశ్వంలోనే విశిష్టమైనది భారత రాజ్యాంగం

(డా. జాకిర్ నాయక్‌తో శేఖర్ గుప్తా ఇంటర్వ్యూ)

## భారత ఓటర్లకు జేజేలు



IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE

وَاعْتَصِمُوا بِحَبْلِ اللَّهِ جَمِيعًا وَلَا تَفَرَّقُوا

(سورة ٣: ١٠٣)

“అందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. చీలి పోకండి”. (దివ్య ఖుర్ఆన్ - 3: 103)



# నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 5, ISSUE: 32
JUNE 2009



CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Sk Abdus Salam Omeri
Tahera Begum

DESIGN
Noushad Zainulabdeen

www.zukhruf.net
Tel. 22474400,99993072



PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait



PHONES
Azeezur Rahman
22444117 EXT. 110
Mujahid Khan Omeri
24711141 EXT. 104

FAX
22400057

E-MAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT




3

## విశ్వంలోనే విశిష్టమైనది భారత రాజ్యాంగం

### ఈ సంచికలో....


| | |
|---|---|
| భారత ఓటర్లకు జేజేలు | 2 |
| డా. జాకిర్‌తో ఇంటర్వ్యూ | 3 |
| ప్రియమైన అమ్మకు | 6 |
| పరమోన్నత మిత్రుడే కావాలి | 8 |
| ప్రవాసాంధ్రులకు | 9 |
| ఖుర్‌ఆన్ పాఠం | 10 |
| పద్దీ | 11 |
| నమాజ్ మేరాజ్ కానుక | 12 |
| సీరత్ క్విజ్ | 13 |
| ధర్మ సందేహాలు | 14 |
| సాఫల్యం వైపునకు రండి | 15 |
| మానవీయ జీవనికి ధర్మదాయి | 16 |
| వివిధ వార్తలు | 17 |
| కమ్యూనిజంకంటే ఉన్నతమైన వ్యవస్థ | 18 |




3

## ప్రియమైన అమ్మకు...!


◆ كلمة العدد (نتيجة الانتخابات في الهند) ◆ مقابلة مع د. ذاكر نايك ◆ إلى أمي الحبيبة . .
◆ أللهم الرفيق الأعلى (تلخيص الرحيق المختوم) ◆ أحفظوا فلذات قلوبكم ◆ إن خير الزاد التقوى
◆ أضرار الرياء ◆ هدية المعراج الصلاة ◆ أسئلة عن السيرة ◆ الفتاوى الشرعية ◆ حي على الفلاح (نشيد)
◆ القرآن هدي للناس (المهتدي) ◆ أخبار اللجنة ◆ العدل الاجتماعي في الإسلام



# భారత ఓటర్లకు జేజేలు

2009 మే నెల....

సుడి గుండంలో సార్క్ దేశాలు.... నేపాల్‌లో రాజకీయ సంక్షోభం.... శ్రీలంకలో 'పెద్ద పులుల' ఏరివేత... పాకిస్తాన్‌లోని 'స్వాత్' లోయలో సైనికులకు - తాలిబాన్లకు మధ్య హోరాహోరీ సమరం.... ఈ మూడు సంక్షుభిత రాజ్యాల మధ్యలోనున్న సువిశాల ప్రజాస్వామిక భారత దేశంలో కీలకమైన ఎన్నికలు!

నెల రోజుల ఈ ఎన్నికల ప్రక్రియ మే 13వ తేదీ నాటికి సజావుగా ముగిసింది. 16న ఫలితాలు వచ్చాయి. ఫలితాలు కూడా చాలా సమంజసంగా - అటు కేంద్రంలోనూ, ఇటు రెండు రాష్ట్రాల్లోనూ (ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా) హంగ్‌లకు, భంగ్‌లకు ఎలాంటి ఆస్కారం లేకుండా స్పష్టమైన మెజారిటీతో వెలువడ్డాయి. సందేహాల స్వాములు వేసిన కాకి లెక్కలు పటాపంచలైనాయి. అనుమానాల అయ్యలు అల్లిన ఊహాగానాలన్నీ బోల్తాకొట్టాయి. గోడ మీద పిల్లి వాటకం ప్రదర్శించేవారు చతికిలపడ్డారు. గోడ క్రింది ఎలుకల్లా వ్యవహరించే అవకాశవాదుల సన్నాయి నొక్కులకు ప్రాధాన్యం లేకుండా పోయింది.

నిజానికి భారత దేశంలో జరిగే పార్లమెంటు ఎన్నికలను యావత్ప్రపంచం ఎంతో ఆసక్తిగా గమనించింది. ఎందుకంటే ప్రపంచమంతటా ఆర్థిక మాంద్యం ఏర్పడిన పరిస్థితిలో ఈ ఎన్నికలు జరిగాయి. ప్రతి సారీ రెండు కూటముల మధ్యనే పోటీ ఉండేది. ఈసారి నలుగురూ నాలుగు ముఠాలు కట్టారు. ప్రాంతీయ పార్టీలు సైతం స్వప్న జగతిలో విహరించాయి. గల్లీ లీడర్లు కూడా ఢిల్లీ (పీ.ఎం) కుర్చీపై కన్నేసారు. సిద్ధాంతాల గురించి మాట్లాడే పార్టీలు సైతం ప్రమాణబద్ధమైన రాజకీయాల (value based politics) కు తిలోదకాలిచ్చి జుగుప్సాకరమైన రీతిలో ఇతర పార్టీలతో బేరసారాలు సాగించాయి. మత విద్వేషాగ్నిని రగిల్చి లబ్ధి పొందేందుకు ప్రయత్నించాయి. ఇలాంటి పరిస్థితిలో ఎంతో నిగ్రహాన్ని, విజ్ఞతను ప్రదర్శించిన భారత ఓటర్లకు జేజేలు పలకాల్సిందే.

మరో ఐదేళ్ళ కోసం కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పడినందున 'అభివృద్ధి' పై దృష్టి కేంద్రీకరించే అవకాశం చిక్కింది. సంక్షోభాల బెడద ప్రస్తుతానికి తప్పింది. ఎన్నికల ఫలితాలు వెలువడగానే స్టాక్ మార్కెట్ ఒక్కసారిగా లాభాల బాటలో ఉరకలేసింది. రూపాయి మారకం విలువ పెరిగింది. అంతర్జాతీయ స్థాయిలో తాండవమాడిన ఆర్థిక మాంద్యానికి భారత దేశం తట్టుకుని నిలబడింది. రానున్న కాలంలో భారత దేశం మరింత వేగంగా ప్రగతి పథంలో దూసుకుపోయే అవకాశాలూ ఉన్నాయి. ఇవన్నీ ప్లస్ పాయింటులే.

అయితే దేశంలోని సగటు మనిషి బ్రతుకులో పెద్ద మార్పు రాలేదు. ప్రగతి మీగడను సంపన్న వర్గాలవారే ఆస్వాదిస్తుండగా, సామాన్యుడికి మజ్జిగ కూడా సరిగ్గా దొరకటం లేదు. ఏలినవారి 'సామాజిక న్యాయ' నినాదం నినాదంగానే మిగిలింది. భారత దేశంలో ముస్లిం మైనారిటీల దయనీయ స్థితికి సచార్ కమిటీ నివేదిక అద్దం పట్టింది. మరి వారి ఉద్ధరణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏ ఏ పథకాలు చేపడతాయో చూడాలి. తాము చేపట్టిన సంక్షేమ పథకాలే తమను గెలిపించాయని ఆం.ప్ర ముఖ్యమంత్రి ఖుద్దుగా చెప్పుకున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు చేసిన వాగ్దానాలను నిలుపుకుంటే ప్రజలు తప్పకుండా వారిని ఆదరిస్తారు. ఆదమరిస్తే ఇక అంతే.



అమ్జదలీ ఖాన్



# విశ్వంలోనే విశిష్టమైనది భారత రాజ్యాంగం

## “ఇస్లాంలో ఎంతో అపార్థానికి గురైన పదం జిహాద్... అంటే మేలైన సమాజ స్థాపన కోసం కృషి చేయటం, పాటుపడటం”.

వినూత్న శైలిలో ఇస్లాం ధర్మ ప్రచారం చేసే మత ప్రబోధకులైన డా. జాకిర్ నాయక్ దృష్టిలో ఒసామా బిన్ లాడెన్ ఒక తీవ్రవాదీ కాదు, అలా అని సాత్వికుడూ కాదు. ఆయన దృష్టిలో సాధ్వీ ప్రగ్య కూడా అంతే! ఎన్‌డిటీవి ‘వాక్ ద టాక్’లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రధాన సంపాదకులైన శ్రీ శేఖర్ గుప్తాతో జరిపిన సంభాషణలో “తప్పుడు సమాచారాల వల్ల కొంత మంది ముస్లిమ్ యువకులు ప్రక్క ద్రోవ పట్టారని, అయితే అలాంటి వారి సంఖ్య చాలా తక్కువ”ని ఆయన అభిప్రాయపడ్డారు.



**శేఖర్ గుప్తా:** హలో వాక్ ద టాక్‌కి స్వాగతం. ముంబాయి సముద్ర తీరం వర్లీ నుండి నేను శేఖర్ గుప్తాను. ఈ వారపు మన అతిథి గురించి చెప్పాలంటే టెలీ ఎవాంజెలిజానికే ఆయన ఒక రాక్ స్టార్. ఆశ్చర్యకరమైన రీతిలో మీరు ఊహించినదానికి భిన్నంగా అధునిక ఇస్లాంను, ఇంకా కేవలం ఇస్లామే గాక ప్రపంచంలోని అన్ని మతాల గురించి తనదైన వ్యాఖ్యానాలతో బోధపరిచే 43 ఏండ్ల జాకిర్ నాయక్ నా అతిథి. వాక్ ద టాక్‌కు స్వాగతం!

**జాకిర్ నాయక్:** హాయ్, మిమ్మల్ని కలుసుకోవడం సంతోషకరం.

**శే.గు:** మిమ్మల్ని కలవడం సంతోషకరం. ఒక ఇస్లామీయ ప్రబోధకుడిగా సూటు, టై ధరించి, టెలివిజన్ మాధ్యమాన్ని ఉపయోగించే మీరు తాలిబానీకరణ లాంటి ప్రస్తుత తరుణంలో టెలివిజన్లను ఉపయోగించరాదని ఇస్లామీయ ప్రబోధకులు ముస్లింలకు ఉద్బోధిస్తుంటారని ప్రజల భావన. కాని మీరేమో అందరికీ భిన్నంగా ఉన్నారు కదా! దీనికి మీరేమంటారు?

జా.నా: కాదు, వాస్తవంగా మీరన్నట్లే నేను అధునిక ఇస్లాంనే అనుసరిస్తాను. ఖుర్‌ఆన్ హదీసు క్రోడీకరణలను విశ్వసిస్తాను. వాటి మూలాధారాలను చూస్తాను. హైందవ ధర్మం గురించి మాట్లాడితే వేదాలను, ఇస్లాం గురించి మాట్లాడితే ఖుర్‌ఆన్ హదీసు ప్రామాణికాలను ఉదాహరిస్తాను. వాటినే లోకానికి అందజేస్తాను.

**శే.గు: ఆ విధంగా తెలుపడం మూలంగా ప్రపంచంలో కోటానుకోట్ల అభిమానులను పొందారు.**

జా.నా: అల్‌హమ్దులిల్లాహ్! ఇదంతా దైవ కృప.

**శే.గు: మూల గ్రంథాలను విశ్వసిస్తానని మీరన్నారు. అనేక మంది ఇస్లాం పేరిట ఆంక్షలను విధించడం ఉదా: టెలివిజన్ చూడటంపై, పాఠశాలలకు వెళ్ళడంపై, ముఖ్యంగా స్త్రీలు లాంటి అంశాలను చూస్తే వారు మూల గ్రంథాలను చదవలేదన్నది మీ అభిప్రాయమా?**

**క్రియాశీల ముస్లింగా ఉంటూనే, భారతీయుడైనందుకు గర్వపడుతున్నాను.**

జా.నా: నా నమ్మకం ఏమిటంటే వారు ఖుర్‌ఆన్ హదీసు వచనాలలో కొన్నింటి అన్వయింపులో పొరబడ్డారు. ఎవరైనా పండితుడు అలా చెప్పి ఉండవచ్చు. అది యాభై ఏండ్లు లేదా 100 ఏండ్లు లేదా 200 ఏండ్ల క్రితమే కావచ్చు. కాబట్టి వారు వారి అభిప్రాయాలనే నమ్ముతూ మూల గ్రంథాలను పరిశీలించకపోయి ఉండవచ్చు. నా వరకు నేనైతే ఒక పండితుడి ప్రకటన విన్నప్పుడు అతను ఎక్కడి నుండి అలా చెప్పాడో పరిశీలిస్తాను. దేని గురించైనా ఒక పండితుడు ఏదైనా చెబితే, ఏమి చెప్పాడో, ఎక్కడి నుండి చెప్పాడో నిర్ధారించకుండానే వాటిని ప్రజలు విశ్వసిస్తుంటారు. నా నమ్మకం ఏమిటంటే టెలివిజన్‌ను ఖుర్‌ఆన్ గాని, హదీసు గాని ఎక్కడా నిషిద్ధమైనదిగా పేర్కొనలేదు.

**శే.గు: సరే.**

జా.నా: అయితే చేతితో రూపంగాని లేదా చిత్రంగాని గీసే విషయం గురించి ఖుర్‌ఆన్ స్పష్టమైన ప్రకటన చేసింది. దీని అర్థం ఫోటోగ్రాఫీ లేదా వీడియో గ్రాఫి కాదు. కనుక ఖుర్‌ఆన్ లేదా హదీసుల్లో టెలివిజన్‌ను నిషిద్ధమైనదిగా పేర్కొనే ఒక్క వాక్యం కూడా లేదని నా అభిప్రాయం. అయితే తప్పుడు విషయాలను వీక్షించడం ఉదా: అశ్లీలత, బూతు చిత్రాలు ఇవన్నీ నిషిద్ధం.

**శే.గు: సరే సరే, వాస్తవంగా కొందరి తప్పుడు చిత్రీకరణ వల్లే ఇస్లాం అన్యాయపదేశంగా చెడ్డ పేరు పొందిందన్నది మీ నమ్మకమా?**
జా.నా: అవును. ఈ విషయంలో పూర్తిగా మీతో ఏకీభవిస్తున్నాను. ఇది ప్రపంచంలోనే అత్యంత అపార్థాలకు గురైన మతము.
**శే.గు: కొన్ని ఉదాహరణలు ఇవ్వగలరా? ఎందుకంటే ప్రపంచంలోని వివిధ వర్గాల ప్రజలతో మీరు సంభాషిస్తుంటారు.**
జా.నా: ఉదాహరణకు:- మేమనేది ఏమిటంటే ఇస్లాంలో తీవ్రంగా అపార్థాలకు గురైన పదం 'జిహాద్'.
**శే.గు: నిజమే.**
జా.నా: టెలివిజన్ ఇతరత్రా మీడియా యొక్క తప్పుడు సమాచారాల వల్ల ప్రజల్లో దీనిపై  అపోహ నెలకొంది. జిహాద్ అనే అరబీ పదానికి మూల అర్థం శ్రమించడం, కష్టపడటం లేదా పోరాడటం అని వస్తుంది. ఇంతే దీని అర్థం కష్టపడటం... పోరాడటం....
**శే.గు: అంటే, దీనర్థం పవిత్ర యుద్ధమనా?**
జా.నా: ఎంత మాత్రం కాదు. ఇస్లామీయ కోణంలో దీనర్థం తన మనో వాంఛలకు వ్యతిరేకంగా పోరాడటం, మంచి సమాజ స్థాపనకై కృషిచేయడం. యుద్ధంలో ఆత్మ రక్షణకై చేసే పోరాటం కూడా జిహాద్ అనబడుతుంది. పవిత్ర యుద్ధం అనే పదం మొదట ప్రయోగించింది శిలువ యుద్ధాలు చేసిన క్రైస్తవులైతే ప్రస్తుతం దురదృష్టవశాత్తూ ముస్లింలకు ఆపాదించబడుతోంది. 'పవిత్ర యుద్ధం' (Holy War) అనే పదాన్ని అరబీలో అనువదిస్తే "హరబన్ ముఖద్దస" అవుతుంది. అయితే ఇలాంటి పదం ఎక్కడా ఖుర్‌ఆన్‌లోగానీ, హదీసుల్లోగాని ప్రస్తావించ బడలేదు.
**శే.గు: పాశ్చాత్యులకు వ్యతిరేకంగా గానీ, లేదా కొన్ని చోట్ల ఇండియాకు వ్యతిరేకంగా గానీ లేదా ఇతర చోట్ల జిహాద్ చేసే ముస్లింల శ్రేయం కొరకు ప్రార్థిస్తుంటారు. దీనిపై మీ అభిప్రాయం?**
జా.నా: కొందరు మంచికై చేస్తుండవచ్చు, ఇంకొందరు తప్పు చేస్తుండవచ్చు.

**భారత శాసనాల ప్రకారం మద్యం సేవించే హక్కు ఉండొచ్చునేమోగాని ప్రతి భారతీయుడు ఖచ్చితంగా మద్యం సేవించాల్సిందే అనే నిబంధన మాత్రం లేదు. ఒకవేళ అలా ఉంటే అదో 'సమస్య'గా మారేది.**

**శే.గు: అవును.**
జా.నా: ఉదాహరణకు ఎవరైనా నీతి బాహ్యతను, చెడును సమాజం నుండి రూపుమాపేందుకు జిహాద్ చేస్తానంటే అతని నిర్ణయం సరైనది అవుతుంది. కాని ఖుర్‌ఆన్ హదీసులకు వ్యతిరేకంగా చేసే ప్రతి పనీ అధర్మమవుతుంది. ఉదాహరణకు:- ఖుర్‌ఆన్ ప్రకారం ఒక వ్యక్తి మరో వ్యక్తిని అన్యాయంగా లేదా భూమి మీద అల్లకల్లోలం సృష్టించే ఉద్దేశ్యంతో హతమారిస్తే, అది మొత్తం మానవ జాతినే హతమార్చినంత పాపం. నిరపరాధి అయిన మనిషిని చంపటాన్ని ఖుర్‌ఆన్ తీవ్రంగా ఖండిస్తోంది.
**శే.గు: అంటే ఇది '26/11న' ప్రజలను చంపినవారికీ వర్తిస్తుందా?**
జా.నా: నూటికి నూరు శాతం. ఇది పూర్తిగా ఖుర్‌ఆన్ హదీసులకు వ్యతిరేకమైన చర్య. 9/11 కు సంబంధించినది కానివ్వండి, '26/11' కు సంబంధించినది కానివ్వండి.  అమాయక ప్రజల్లో ఒక్కరిని




చంపినా మొత్తం మానవ జాతినే హత్య చేసినంత ఘోర పాపంగా పేర్కొంటోంది ఖుర్‌ఆన్. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను పురస్కరించుకుని వేలమందిని చంపడంగానీ, '26/11'న వందల మందిని పొట్టన పెట్టుకోవటంగానీ పూర్తిగా మత వ్యతిరేక చర్య.
**శే.గు: ప్రత్యేకించి '26/11' లాంటి ఉదాహరణలను గురించి (ఏమంటారోనని) నేను ఎదురు చూస్తున్నాను.**
జా.నా: నూరు శాతం, నూటికి నూరు శాతం తప్పు. బజారుకెళ్ళే అమాయక ప్రజలను హతమార్చడం - అది ముస్లిమేతరుడైనా సరే. ఒకవేళ ముస్లిమేతరుడు మీకు హాని చేసినా సరే మీరు వెళ్ళి అతన్ని చంపలేరు. ఇది పూర్తిగా ఇస్లాంకు విరుద్ధం.
**శే.గు: అలాంటి చర్యలను ఇస్లాం పేరుతో సమర్థించటం పట్ల మీరు అభ్యంతరం వ్యక్తపరుస్తున్నారా?**
జా.నా: నూటికి నూరు శాతం... ఖచ్చితంగా.
**శే.గు: మీ డీవీడీలు చాలా చూశాను. వాస్తవంగా నన్ను బాగా ఆకర్షించిన అంశం ఏమిటంటే 9/11 మరియు ఒసామా బిన్ లాదెన్‌కు సంబంధించి మీరొక విశిష్ట ప్రకటనే చేశారు. అందులో మీరు అతన్ని ఉగ్రవాది అని గాని, ఉగ్రవాద నాయకుడని గాని పేర్కొనేందుకు సంకోచిస్తున్నారు....**
జా.నా: అంటే అతను తీవ్రవాది అనో లేదా పవిత్రుడనో అంగీకరించేందుకు తటపటాయిస్తున్నాను అనేదే కదా, మీ ఉద్దేశ్యం?
**శే.గు: తీవ్రవాదా, సాధు స్వభావుడా?**
జా.నా: మీరు చూస్తున్నట్లే ఒసామా బిన్ లాదెన్ గురించి వ్యక్తిగతంగా నేను న్యూస్ ఛానల్స్ ద్వారా, బిబిసి, సి ఎన్ ఎన్ ద్వారా తెలుసుకున్నాను. కాబట్టి ఒసామా బిన్ లాదెన్ గురించి నా అభిప్రాయాన్ని అడిగితే నేనూ అదే చెప్పొచ్చు. కాని ఇది న్యాయం కాదు. ఎందుకంటే ఖుర్‌ఆన్ ప్రకారం మీ వద్దకు ఏదైనా వార్త వస్తే దాన్ని మీరు మూడో వ్యక్తికి చేరవేసే ముందు నిజాన్ని నిర్ధారించుకోవాలి. నేను వ్యక్తిగతంగా నిర్ధారించలేదు.
**శే.గు: జర్నలిజం స్కూళ్ళలో ఇదే మేమూ బోధిస్తుంటాము.**
జా.నా: చాలా మంచిది, కాబట్టి ఒసామా బిన్ లాదెన్ గురించి దురదృష్టవశాత్తు నన్ను అడిగితే అతను తీవ్రవాది అనిగానీ, సాధుస్వభావుడని గానీ చెప్పలేను. నాకైతే తెలీదు. నేను అతన్ని పరీక్షించనూ లేదు. జాకిర్ నాయక్ ఒసామా బిన్ లాదెన్‌ను సమర్థిస్తున్నాడని అదే పనిగా ప్రజలంటుంటారు. ఇది వాస్తవం కాదు, నేను ఈ విషయంలో తటస్థంగా ఉన్నాను. అందువల్ల నాకు తెలియని వ్యక్తి గురించి నేను ఏమీ చెప్పలేను.




**శే.గు: అదే సమయంలో ఆ జంట టవర్లను కూల్చి విధ్వంసం సృష్టించిన వారి గురించి మీరు....**

జా.నా: నేను చెప్పేది విధ్వంసం సృష్టించింది ఎవరైనాసరే అది నూటికి నూరు శాతం తప్పు. వాడి చర్యను ఖండించాల్సిందే...

**శే.గు: మరి వాడు తీవ్రవాదే కదా?**

జా.నా: నూటికి నూరు శాతం. వాడు చేసింది తప్పు.

**శే.గు: అయితే అది చేసింది ఒసామా బిన్ లాడెన్ కాకపోవచ్చని మీ నమ్మకమా?**

జా.నా: అదే. తరచూ నేను ప్రయాణిస్తూ ఉండటం మూలంగా 9/11 కి సంబంధించి నాకు లభించిన కొన్ని డాక్యుమెంటరీల సమాచారం ప్రకారం అది "ఇన్ సైడ్ జాబ్". 9/11 బుష్ జరిపించిన ఇన్ సైడ్ జాబ్. అలా అని ఇదే సరైందని చెప్పడం కాదు. ఈ వివాదాస్పద సమాచారం కలిగిన డాక్యుమెంటరీలలోని సాక్ష్యాలు ఒసామా బిన్ లాడెన్ మీదవున్న సాక్ష్యాల కన్నా బలంగానే ఉన్నాయి.

ఇదే క్రమంలో సాధ్వి ప్రగ్య ఠాకూర్ గురించి నన్నెవరో, "ఆమె తీవ్రవాదా?" అని అడిగినప్పుడు, "చూడండీ అది పోలీసు చేస్తున్న ఆరోపణ" అని చెప్పాను. నావరకైతే ఆమె తీవ్రవాదా లేక సాధ్వినా? అని పేర్కొనేందుకు ఆమెను ఖచ్చితంగా విచారించాల్సి ఉంటుంది.

**శే.గు: అవును.**

జా.నా: జడ్జీ తీర్పులను చాలా సందర్భాల్లో, దాదాపు అన్నింటిలో భారతీయ ధర్మాసనం తీర్పులను నేను గౌరవిస్తాను.

**శే.గు: ....మీరు గౌరవిస్తారా?**

జా.నా: నేను ఏకీభవించని సందర్భాలు ఒకటి రెండు అంతకన్నా ఉండకపోవచ్చు.

**శే.గు: అవి ఏమిటి?**

జా.నా: ఉద్వేగాలకు లోనయ్యే బదులు పూర్వాపరాలను క్షుణ్ణంగా పరిశీలించాలనేది నా ఉద్దేశ్యం. నేను గమనిస్తున్నదేమిటంటే నిరపరాధులైన ప్రజలు - వారు ముస్లింలైనా కావచ్చు ముస్లిమేతరులైనా కావచ్చు - కొన్ని స్వార్థ శక్తుల వల్ల పీడించ బడినప్పుడు చివరిగా న్యాయస్థానం వారికి అండగా నిలుస్తుంది. ఎట్టకేలకు పీడితప్రజలు ధర్మం పొందుతున్నారు. అందుకు రెండు ఏండ్లు లేదా 5 ఏండ్లు లేక 10 ఏండ్లు పడుతున్నా న్యాయం నిర్దోషుల ప్రక్క నిలుస్తుంది. దీనివల్ల న్యాయ వ్యవస్థ పట్ల నమ్మకం ఏర్పడుతుంది. అందువల్లే సాధ్వీ గురించి నన్ను అడుగినప్పుడు "ఆమె మంచిదీ కాదు, చెడ్డదీ కాదు, తీవ్రవాదీ కాదు, అమాయకురాలూ కాదు" అని చెప్పాను. అయితే దీన్ని పత్రికలు పేర్కొనలేదు. ముస్లిములకైనా ముస్లిమేతరులకైనా నా దృష్టిలో ఒకే కొలబద్ద ఉంది.

**హైందవ ధర్మం గురించి మాట్లాడితే వేదాలను ఉదాహరిస్తాను. ఇస్లాం గురించి మాట్లాడినప్పుడు ఖుర్ఆన్ హదీసులను ఉటంకిస్తాను.**

**శే.గు: ఒసామా కొరకైనా....సాధ్వీ కొరకైనా....??**

జా.నా: అవును.

**శే.గు: మరి రాజ్యాంగం గురించి మీరేమంటారు? రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పిస్తోంది. అయితే ప్రత్యేకంగా ముస్లిం సముదాయాలలో అనేక మంది భారత వ్యవస్థ పట్ల రాజ్యాంగం పట్ల ఎందుకు పూర్తి నమ్మకము కలిగిలేరు?**

జా.నా: భారత రాజ్యాంగ వ్యవస్థకు సంబంధించినంతవరకు అనేక సందర్భాల్లో నా అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పడం జరిగింది. భారతీయుడైనందుకు నాకెంతో గర్వంగా ఉందనే విషయాన్ని తరచూ నా ఉపన్యాసాల్లో పేర్కొంటూ ఉంటాను. తమకు ఇష్టమైన ధర్మాన్ని ప్రచారం చేసుకునేందుకు, ఆచరించేందుకు, అనుసరించేందుకు తమ పౌరులకు హక్కులిచ్చిన బహు కొద్ది దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచంలో నేను చూసిన రాజ్యాంగాలలోకెల్లా భారత్ మేలైనదని అంటాను.

**శే.గు: భారత రాజ్యాంగం మతాలపై ఎలాంటి ఆంక్షలను విధించదు.**

జా.నా: అవును. ధర్మాన్ని ఆచరించే ఒక ముస్లిముగా, రాజ్యాంగాన్ని పాటించే ఒక భారతీయ పౌరుడిగా నాకు తెలిసినంత వరకూ ఇస్లాం నిషేధించిన వాటిని ఆచరించమనిగాని లేదా ఇస్లాం ఆజ్ఞాపించిన వాటిని నిషేధించమని గానీ చెప్పే ఒక్క శాసనం కూడా భారత రాజ్యాంగంలో లేదు. కాబట్టి క్రియాశీల ముస్లింగా ఉంటూనే, భారతీయుడైనందుకు గర్వపడుతున్నాను.

**శే.గు: ఈ విషయం మీరు ప్రేక్షకుల మధ్య చెప్పినప్పుడు ముఖ్యంగా ముస్లిం ప్రేక్షకుల్లోని యువత దీనిపట్ల తమ అసంతృప్తిని వ్యక్తం చేశారా?**

జా.నా: కొందరు సంతోష పడకపోవచ్చు. కాని అత్యధికులు సంతోషిస్తారు. ఎందువల్లనంటే వారికి నేను కారణాలను వెల్లడిస్తాను. నేను ఏదైనా చెప్పినప్పుడు అందుకు ఆధారాలను కూడా ఉదాహరిస్తాను. ఉదాహరణకు మద్యం సేవించే హక్కు ఉండొచ్చునేమోగాని ప్రతి భారతీయుడు ఖచ్చితంగా మద్యం సేవించాల్సిందే అనే నిబంధన మాత్రం లేదు. ఒకవేళ అలా ఉంటే అదో 'సమస్య'గా మారేది. కాబట్టి ఇస్లాం పాటించే స్వేచ్ఛ ఇస్తూ అదే సమయంలో తమ ధర్మాన్ని ఆచరిస్తూ ఒక మంచి ముస్లింగా ఉండే వీలు కల్పిస్తోంది. ఇండియాలో ప్రత్యేక 'ముస్లిం పర్సనల్ లా' కూడా ఉంది. మన ధర్మాన్ని మనం పాటించే స్వేచ్ఛ కల్పిస్తోంది.

(ఇంకా ఉంది)

**"పవిత్ర యుద్ధం (Holy War) అనే పదాన్ని మొట్ట మొదట ప్రయోగించింది క్రూసేడులు. కాని దురదృష్టవశాత్తూ ప్రస్తుతం అది ముస్లింలకు ఆపాదించబడుతోంది".**

- సయ్యద్ షమీమ్ సుల్తానా



# ప్రియమైన అమ్మకు...!

**ప్రేమ -**

ఎన్నో హృదయాల, ఎన్నో జీవితాల కలయిక ప్రేమ. ప్రేమ ఎప్పుడూ స్వార్థాన్ని కాదు, త్యాగాన్ని నేర్పుతుంది. తల్లీ బిడ్డల బంధంలో, అన్నా చెల్లెళ్ల అనురాగంలో, అవ్వా మనవళ్ళ వాత్సల్యభరిత బంధంలో, ఆలుమగల అన్యోన్యతలో, దేవుడూ దాసుడి సంబంధంలో ఒకరిపై ఒకరికున్నది కూడా అవిభాజ్యమైన ప్రేమే! అయితే, ఆకర్షణనే ప్రేమని భ్రమించేవారు కొందరైతే, కాలక్షేపాన్ని ప్రేమగా అభివర్ణించేవారు మరి కొందరు. ఉన్మాదాన్ని, పైశాచికాన్ని ప్రేమగా చెప్పుకునేవారు కొందరైతే, క్రూరమైన ఆలోచనల్ని పుట్టించేది, హద్దులు మీరేలా ప్రేరేపించేది ప్రేమ అని భాష్యం చెప్పుకునేవారు కొందరు.

అలా ఎవరికి వారు తమకు నచ్చిన తాత్పర్యాలు చెప్పుకుంటూ భ్రమల వలయంలో చిక్కుకొని ఎటూ పాలుపోక, ఏం చేయాలో తోచక ఘోరమైన నేరాలకు, అఘాయిత్యాలకు, అన్యాయాలకు పాల్పడుతున్నారు. తాము నష్టపోవడమే కాక ఎన్నో కుటుంబాలను శోక సముద్రంలో ముంచేస్తున్నారు. ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ విధంగా తెలిసీ తెలియని వయసులో మాయలోకానికి మోసపోయి, నిండు ప్రాణాల్ని వదిలిన ఓ అమ్మాయి వాస్తవ గాథను ఆధారంగా చేసుకుని ఈ వ్యాసం వ్రాయబడుతోంది. ఒకవేళ మరణించిన ఆ అమ్మాయి మౌనం వీడి, మాట్లాడి ఉంటే ఎలా ఉండేదో... అన్న ఊహకు ప్రతిరూపమే ఈ వ్యాసం. ఈ వ్యాసం వల్ల ప్రతి హృదయంలో కొద్దో గొప్పో మార్పు వచ్చి తీరుతుందని, ప్రజలు ముఖ్యంగా తల్లిదండ్రులు కొత్త కాంతికి కళ్ళు తెరవగలరని విశ్వాసం.

సారీ అమ్మా...! నా బాధ నీతో కాకపోతే ఇంకెవరితో చెప్పుకోను చెప్పు....అమ్మా....! నిజంగా నాకు ఆ క్షణంలో ఏమీ తోచలేదు... ఎవరైనా నా తరఫున మాట్లాడే వ్యక్తి ఒక్కరుంటే చాలు అన్పించింది... మనసున ఉన్నదంతా చెప్పాలన్పించింది... లిఖిత పూర్వకంగా నా మనోవేదనను భద్రపర్చాలన్పించింది.... అమ్మమ్మ ఒడిలో కాసేపు నిద్రపోవాలన్పించింది.... నీ కౌగిట్లో చేరి కళ్ళు కాయలు కాసేదాక ఏడ్వాలన్పించింది.... నా ప్రేమ గురించి, నాకు జరిగిన అన్యాయం గురించి నాన్నతో మనసు విప్పి మాట్లాడాలన్పించింది.... నా మనోగతాన్ని చెల్లితో చెప్పుకోవాలన్పించింది... ఇన్ని ఆలోచనలు నన్నెంత ఒత్తిడికి గురి చేస్తున్నాయో.... ఎంత పిచ్చెక్కిస్తున్నాయో చెప్పుకోవాలన్పించింది.... కానీ నేను ధైర్యం చేయలేక పోయాను.... ఏ ముఖంతో మీ ముందుకు రావాలని లోలోన కుమిలిపోయాను... నాలుగు గోడల మధ్య నన్ను నేను బంధించుకున్నాను... నా మెదడును, హృదయాన్ని పిండేసే పిచ్చి ఆలోచనలు... వాటిని ఎలా అధిగమించాలో తెలియక నేననుభవించిన నరకం వర్ణనాతీతం అమ్మా!

ఎన్నో రాత్రులు నిశిరాత్రి పశ్చాత్తాపంతో గడిపాను... దైవ సమక్షంలో నా తప్పుల్ని ఒప్పుకున్నాను... కానీ మీతో అనలేక పోయాను... వాటి నుండి పారిపోవాలనుకున్నాను... జీవితం నుంచే పారిపోతానని ఆ క్షణం నేను ఊహించనన్నా ఊహించ లేదు.

ఆ క్షణం... నేను తుది శ్వాస వీడిన భయంకర క్షణం... ఆ క్షణం నాన్న నా దగ్గరకొచ్చి నన్ను ఒళ్ళో తీసుకుని అభయమిస్తూ నాలుగు మాటలు మాట్లాడితే బాగుండు అన్పించిందమ్మా... నిజంగా నాన్న గారి మాటలకు అంత శక్తి ఉందని నాకు బాగా తెలుసు... ఆయన ప్రసంగాలు శ్రోతల్ని ఎలా ఉద్రూతలూగిస్తాయో, ఎలా కన్నీళ్ళు పెట్టిస్తాయో అనుభవపూర్వకంగా నాకు తెలుసు... కాని నిజం నాన్న గారికి తెలీదు... ఆ నిజం ఆయన్ను నిప్పులా ఎక్కడ దహించి వేస్తుందోనన్న భయంతో నేనే చెప్పలేదు... అసలు ఆ నాలుగు రోజులూ నాన్నగారి ముఖం కూడా నేను చూడలేక పోయాను... ఆయనతో మాట్లాడలేక పోయాను... నాకిష్టమైన కోడి కూర చేసి ప్లేటు నిండా అన్నం పెట్టి 'అబ్బా జాన్! భోజనానికి రండీ' అని పిలువలేక పోయాను... అమ్మా! ఇవన్నీ నన్ను రోజుకి వేల సార్లు బాధించాయి... నా కంటి మీద కునుకు లేకుండా చేశాయి... అమ్మా...! నీకు తెలిసో తెలియదో... ఎన్ని సార్లు నీ ఒడిలో వాలిపోయానో... నీ చీర కొంగు అప్పుడప్పుడూ తడిసిపోతూ ఉండేదే...! అవన్నీ నా కన్నీళ్ళేనమ్మా! ఏం చేయను... మరీ దుఃఖం ఆగనప్పుడు...!!

అమ్మా...! నేను అలా చేయడానికి కారణాలు లేకపోలేదు... కన్ను గీటడాలు, సైగ చేయడాలు, ఏకాంత కలయికలు తప్పని తెలిసి కూడా... ఒక పరాయి స్త్రీ మరో పరాయి పురుషుడితో ఏకాంతంలో ఉంటే మూడోవాడుగా షైతాన్ వారికి తోడవుతాడు అని విని కూడా... చెట్టాపట్టా లేసుకుని, సిగ్గు విడిచి మరీ షికార్లు తిరిగాను... ఇది నిజమైన స్త్రీ స్వేచ్ఛకు ప్రతిబింబం అని లోలోన మురిసి పోయాను... మానవ రూపంలో తోడేళ్ళుం టాయని... ఆ క్షణం.. నేను తెలుసుకోలేక పోయాను..., తుమ్మెద లాంటి స్త్రీ స్వర్గపు సువాసనకు సైతం నోచుకోదు' అన్న మాట నాకు తట్టలేదు... 'శీలమే స్త్రీ అసలు సంపద' అని నాకన్పించలేదు... కోరికల మజాలు జుర్రుకోవడమే నా పరమావధి... షైతాన్ నన్ను అలా ఇరికించాడు... రేయింబవళ్ళు నిర్విఘ్నంగా సాగే ఫోన్ కాల్స్... చాటుమాటు కలయికలు... ఇంటర్నెట్ చాటింగులు... నన్ను ఈ పాపం చేసేలా ఉసిగొల్పాయి... నన్ను నిలువునా ముంచేశాయి... అమ్మా..! నీకు గుర్తుండే ఉంటుంది... నాన్నంటుండేవారు 'నా బిడ్డ



నిప్పు' అని. ఆ నిప్పే ఆయన కీర్తి ప్రతిష్ఠల్ని, మాన మర్యాదల్ని మంట గలుపుతుంది అని ఆ క్షణం ఆయన సైతం ఊహించి ఉండరు... ఆయనకు నా మీదున్న మమకారం, నమ్మకం అటువంటిది... నా బిడ్డ ఏది చేసినా మంచే చేస్తుందన్నది ఆయన విశ్వాసం...

**అమ్మా! నేను విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డానమ్మా... ఎంతో మంది నమ్మకాలతో నేనాడుకున్నానమ్మా... ఇప్పుడు నాకన్పిస్తుందమ్మా... నేనెవర్నీ మోసం చేయలేదు... నన్ను నేను మోసం చేసుకున్నాను... ఎవర్నీ గెలిచి రాలేదు.. నాపై నేనే ఓడిపోయాను... నన్ను నేనే కోల్పోయాను... ఇవన్నీ ఇప్పుడర్థమవుతున్నాయమ్మా!!**

ఇవన్నీ చెప్పి నేను చేసిన నిర్వాకాన్ని సమర్థించుకుంటున్నానని అనుకోకు... ఆ ఉద్దేశం నాకు లేదు కూడా... నిజంగానే నేను తప్పు చేశాను... తప్పంతా నాదే... ఇందులో మీ ప్రమేయంగానీ, శిక్షణాలేమి గాని లేదు... మీ తర్ఫీదు మంచిదే. నా యౌవనమే నాతో ఈ పని చేయించింది... నేను అలా చేసి ఉండకూడదు. నీకు తెలుసా అమ్మా... నేను ఈ పని ఎంతో ఒత్తిడి మీద ఇష్టం లేకుండా చేశానని... ఒక తప్పు జరిగిపోయిన తర్వాత 'ఆత్మహత్య చేసుకునేవారు నరకంలో శాశ్వతంగా ఉంటారని' తెలిసి కూడా నేను మరో నేరానికి పాల్పడుతున్నాను... దేవుడు క్షమిస్తాడన్న ఆశ ఈ క్షణం కూడా నాలో బలంగానే ఉంది... ప్రతి స్లీపింగ్ పిల్ మింగేటప్పుడు పుట్టిదు దుఃఖాన్ని అనుభవించాను తెలుసా అమ్మా! అలా నేను మింగే ఒక్కొక్క నిద్ర మాత్ర నీ తరపున, నాన్న తరపున నన్ను కొన్ని వేల ప్రశ్నలు అడిగాయి తెలుసా! వాటికి సమాధానం చెప్పుకోలేక... నాలో నేను ధైర్యాన్ని పెంచుకోలేక మరో మాత్ర వేసుకునేదాన్ని... అమ్మా..? నీకో నిజం చెప్పనా... అలా నేను చేసేటప్పుడు కూడా ఎందుకో మీతోనే ఉంటానని పించింది తప్ప, దూరంగా... మరీ చేరుకో లేనంత దూరంగా వచ్చేస్తానని ఊహించనే లేదు. మీ ఆశలపై నీళ్ళు చల్లిన నా నిర్ణయాన్ని గుర్తు చేసుకుని... రెప్పలు అలసిపోయేలా ఏడుస్తున్నాను...!

నాకిప్పుడనిపిస్తుంది... తెలియనితనంతో చేసిన తప్పుకి నాకు నేనిచ్చుకున్న శిక్ష సరైనదేనా? అని. నా స్వార్థం కోసం మిమ్మల్నందర్నీ బాధించడం సహేతుకమా? అని... ఆ మాత్రం దానికి జీవితాన్ని, అంతకంటే విలువైన మిమ్మల్ని, మీ ప్రేమను వదులుకుని ఇలా అర్ధాంతరంగా నిర్ణయం తీసుకోవాలా అని. అంతెందుకు... జీవితాంతం నిన్ను నాన్నను ప్రేమిస్తూ ఉండిపోతే ఏం నష్టం... నా లక్ష్యాలకు మీరు అడ్డు కారు... నా అభివృద్ధికి మీరు ఆటంకం కాదు... నా రక్షణకు మీరు ముందుంటారు.. నా అవసరాలు గుర్తిస్తారు... నా శ్రేయస్సు కోరుకుంటారు... అన్నింటికీ మించి నా కంటిలో నలుసు పడితే మీ గుండెల్లో ముల్లు గుచ్చుకున్నంత బాధ పడతారు... అంతగా ప్రేమిస్తారు మీరు నన్ను... ఈ ప్రేమ చాలదా అన్పిస్తుంది అమ్మా..!

అమ్మా...! 'ఫలానా ప్రేమ లేకపోతే జీవితం లేదు' అని నాకిప్పుడనిపించడం లేదు... 'కామం అనేది జ్ఞానాన్ని పోగొట్టును'..., 'కామా తురాణాం న భయం న లజ్జ' అన్నట్టు మూర్ఖంగా ప్రవర్తించాను... యదార్థం ఇప్పుడర్థమయింది... ప్రేమ అందరి మధ్యనా అన్ని బంధాల్లోనూ ఉంది. చిన్న వ్యత్యాసం అంతే... ఆ మాత్రం దానికే... అందులో ఏదో ఒక ప్రేమ కోసం... అది కూడా ఎన్నాళ్ళు అదే స్థాయిలో ఉంటుందో తెలియని ఆకర్షణ కోసం నేను నా జీవితాన్ని, శీలాన్ని పోగొట్టుకోవడం తప్పనే అన్పిస్తుంది... అసలీ జీవితంలో మీలాంటి అమ్మ ...నాన్న.. అన్నా.. చెల్లెలు లేదా స్నేహితులలో... శ్రేయోభిలాషులలో... ఆత్మ బంధువులలో ఇంత మంది రూపంలో ప్రేమను పొందవచ్చు అని తెలిస్తే ఇకపై ఎవరూ నాలాంటి పిచ్చి పని చేయరని అన్పిస్తుంది. ప్రేమ పేరుతో మోసపోయి ప్రాణాలు తీసుకునే వారికి, ప్రేమ కోసం అంటూ ప్రాణాలు తీసేవారికి కూడా నీ లాంటి తల్లి కంట ఒలికే ఒక్క కన్నీటి చుక్క వెనుక ఉన్న ప్రేమ సాగరాన్ని చూసినా అసలు అలాంటి తప్పుడు ఆలోచనలు రావు. ఆత్మహత్యలూ... హత్యలూ...యాసిడ్ దాడులు...ఏవీ ఉండవనిపిస్తుందమ్మా! అలాగే ఈ సామాజిక రుగ్మతల్ని అరికట్టే ఓ కట్టుదిట్టమైన చట్టం ఖచ్చితంగా అమలు పరిస్తే నాలాంటి ఎందరినో కాపాడవచ్చనిపిస్తుందమ్మా...! అమ్మా..! నాకు దుఃఖం ఆగటం లేదు... చివరి సారిగా నాదో మనవి... క్రమం తప్పకుండా నా చెల్లెళ్ళకు ఖుర్‌ఆన్‌లోని 'నూర్' సూరాను చదివి విన్పిస్తూ ఉండు... వారు ఇంటికి ఆలస్యంగా వచ్చినా... ఇంటి బైట ఎక్కువ సేపు గడిపినా... ఇంటర్నెట్ ముందు గంటల తరబడి కూర్చున్నా... వారి ప్రతి కదలికను గమనిస్తూ ఉండు... అమ్మా... నీ చీర కొంగు ఇప్పటికే తడిసి ముద్దయింది... నా కోసం దుఆ చెయ్యి... నన్ను క్షమించమని అల్లాహ్‌ను వేడుకో... సారీ అమ్మా... నాన్నకు... చెల్లెళ్ళకు... అన్నయ్యకు కూడా సారీ... మీరందరూ పెద్ద మనసుతో నన్ను క్షమిస్తారన్న ఆశతో...!



ఇట్లు
- మీ కూతురు

ఆధారం
అర్రహీఖుల్ మఖ్తూమ్

# పరమోన్నత మిత్రుని వైపునకు

సంక్షిప్తీకరణ
సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

**హజ్జ్** యాత్ర నుండి తిరిగి వచ్చిన రెండు నెలల లోపే మహా ప్రవక్త (స) గారికి జబ్బు చేసింది. తీవ్రమయిన తల నొప్పితో ముఖ మంతా ఎర్రబడింది. అనారోగ్యానికి గురైన అయిదవ రోజు ప్రవక్త (స) ఉహద్ కొండ వైపు వెళ్ళారు. అక్కడ చేరుకుని ఉహద్ యుద్ధంలో అమరగతులైన వారి కోసం దుఆ చేశారు. ఆ తర్వాత మస్జిదె నబవీ చేరుకుని ప్రజలనుద్దేశించి ఇలా ప్రసంగించారు. "బాగా వినండి! మీరు నా సమాధిని ఆరాధనా స్థలంగా మార్చుకోకండి. అన్సార్లతో మంచిగా వ్యవహరించండి".

మరణానికి నాలుగు రోజుల ముందు జ్వరం తీవ్రమవ్వసాగింది. శరీరమంతా కాలి పోతుంది. సహచరులు ఆయన తలపై నీళ్ళు పోశారు. ప్రవక్త (స) మస్జిద్‌కి బయలుదేరారు. సరిగ్గా అదే సమయంలో హజ్రత్ అబూ బకర్ (రజి) నమాజు చేయించడానికి ఇమామ్ స్థానం మీదికెళ్ళి నిల్చున్నారు. దైవప్రవక్త (స) వస్తున్నట్లు అలికిడి వినగానే ఆయన అక్కడ్నుంచి తప్పుకోబోయారు. కానీ ప్రవక్త (స) నమాజు పూర్తి చెయ్యమని ఆజ్ఞాపించారు. నమాజు తర్వాత శ్రోతలను ఉద్దేశించి ప్రసంగం చేశారు: "అల్లాహ్ తన దాసుడ్ని ఈ ప్రపంచంలోనైనా ఉండవచ్చుని,లేదా తన అనుగ్రహ ఛాయలోకి అయినా రావచ్చుని స్వేచ్ఛ ఇచ్చాడు. అప్పుడా దాసుడు దేవుని అనుగ్రహ ఛాయలోకి వెళ్ళే విషయానికే ప్రాధాన్యం ఇచ్చాడు" అన్నారు. ఈ మాట వినగానే హజ్రత్ అబూ బకర్ (రజి) దుఃఖం ఆపుకోలేక బోరున ఏడ్చారు. "మీ కోసం మా తల్లిదండ్రుల్ని, తాత ముత్తాతలందర్ని త్యాగం చేస్తాము" అన్నారు. ఎందుకంటే దైవప్రవక్త (స) త్వరలోనే ఇహలోకం వీడనున్నారని ఆయన పసిగట్టారు. ఆ తర్వాత ప్రవక్త (స) ఇంకా ఇలా అభిప్రాయపడ్డారు: "మైత్రి విషయంలో నైతేనేమీ, ధనం విషయంలోనైతేనేమీ, అబూ బక్ర్ (రజి) ప్రజలందరికన్నా నా దృష్టిలో గొప్ప త్యాగధనుడు. అల్లాహ్‌ను వదలి మరెవరినైనా మిత్రుడ్ని చేసుకునే వీలుండి ఉంటే నేను అబూ బక్ర్ (రజి)ను మిత్రుడ్ని చేసుకునేవాడ్ని. అయితే ఇస్లాం కారణంగా మనం పరస్పరం సహోదరులం, బంధువులం".

మరణానికి ముందు ప్రవక్త (స) తన బానిసలకు స్వేచ్ఛనిచ్చారు. తమ దగ్గర ఉన్న ఏడు దీనార్లు (తాను చనిపోతే ఈ ప్రజా ధనం తన దగ్గరే ఉండిపోతుందని భయపడి) తక్షణమే నిరుపేదలకు దానం చేసేశారు. తన ఆయుధాల్ని సైతం ముస్లింలకు పంచి పెట్టారు. (ఆ రాత్రి హాయిగా గడిచి పోయింది).

మరునటి రోజు సోమవారం తెల్లవారు ఝామున అనుచరులంతా ఫజ్ర్ నమాజ్‌లో లీనమై ఉండగా, హజ్రత్ ఆయిషా (రజి) గారి గదిలో నుంచి కిటికి తెర పైకెత్తి సహచరుల్ని చూశారు. (చివరికి తాను ఆశించిన సమాజం పుడమిపై ఆవిర్భవించిందని తలచి) ఆయన తృప్తిగా నిట్టూర్పు వదిలారు. ఆయన హృదయం ఆనందంతో పరవశించి పోయింది. ఆయన పెదాలపై చిరునవ్వు కదలాడింది. ముస్లింలను నమాజు పూర్తి చేయమని చేతితో సైగ చేసి కిటికి తెర దించి వేశారు. సూర్యుడు కాస్త పైకి ఎగబ్రాకాక తన ముద్దుల కూతురు ఫాతిమా (రజి) గారిని దగ్గరకు పిలిచారు. ఆమె దగ్గరకు వెళ్ళగా, ఆమె చెవిలో ఏదో చెప్పారు. అది విని ఆమె బోరున విలపించారు. దైవప్రవక్త (స) కూతురి చెవిలో మళ్ళీ ఏదో చెప్పారు. ఆ మాట విని ఆమె చిరు నవ్వు నవ్వారు. హజ్రత్ ఆయిషా (రజి) గారు ఇలా అన్నారు: మేమందరం ఆ విషయం గురించి ఆరా తీశాము. అందుకామె దైవప్రవక్త (స) నాతో మొదట 'నేనిక ఎంతో కాలం బ్రతకను. నన్ను ప్రభాత వేళ (ఆరిపోయే) దీపంగా భావించమ్మా!' అన్నారు. అది విని నేను ఏడ్చాను. ఆ తర్వాత వెనువెంటనే 'నేను వెళ్ళాక నా దగ్గరకి అందరికంటే ముందు నువ్వే వస్తావమ్మా!' అన్నారు ప్రవక్త (స). అప్పుడు నేను నవ్వాను. ఆ సందర్భంలోనే ప్రవక్త (స) హజ్రత్ ఫాతిమా (రజి) గారికి "నువ్వు విశ్వంలోని స్త్రీలందరికి నాయకురాలివి" అని శుభాకాంక్షలు తెలియ జేశారు. ఆ తర్వాత; హసన్, హుసైన్‌లను దగ్గరకు తీసుకుని ముద్దాడారు. వారిని బాగా చూసుకోమని బోధించారు.






- సిఫాత్ ఆలం మదని

# వికసించే ఈ లేత మొగ్గలను కాపాడుకోండి

## ప్రవాసాంధ్ర సోదరులారా!

దేవుడు మిమ్మల్ని కువైట్‌కు చేర్చాడు. జీవనోపాధిని సమకూర్చాడు. మీరు మీ కాళ్ళపై నిలబడగలిగారు. ఓ ఇంటి వారయ్యారు. దేవుడు మీకు పండంటి బిడ్డలను కూడా ప్రసాదించాడు. అక్కడ మీ ఇల్లు పిల్లాపాపలతో కళకళలాడుతుంటే ఇక్కడ మీరు వారి గురించి నలుగురితో చెప్పుకుని, వారి ఫోటోలు చూపించుకుని ఆనందిస్తున్నారు. నిజంగా ఈ ఆనందం వెలకట్టలేనిది. సదా మీ ఇల్లు ఇలాగే కళకళ లాడాలన్నది, మీ నిలయం కలకాలం శ్రీ నిలయమై నిలవాలన్నది మా ఆకాంక్ష.

అయితే మీరు పెంచే పూవనంలోని ముసిముసి నవ్వుల పాలబుగ్గలు, వికసించే లేత మొగ్గలు మున్ముందు మీకు కన్నుల పండుగ కావాలంటే, మీ చల్లని లోగిలిలో ఆనందం నిండాలంటే, అనురాగం పండాలంటే వారిని కంటికి రెప్పలా చూసుకోవాలి. వారికెలాంటి తెగులు పట్టకుండా, కాలుష్యం కాటేయకుండా కాపాడుకోవాలి. అంటే పసితనం నుండే ధార్మికంగా మీ పిల్లల్ని తీర్చిదిద్దాలి. సంస్కారం నేర్పాలి. కుటుంబ విలువలను, నైతిక విలువలను నూరిపోయాలి. స్కూలు చదువుతోపాటు, దీని తాలీమ్ కూడా ఇవ్వాలి. మీ మీ పేటలలోని మస్జిద్‌లలో జరిగే ఖుర్‌ఆన్ బోధనా తరగతులకు వారిని పంపుతూ ఉండాలి. ముఖ్యంగా వేసవి సెలవులలో వారి సమయం వృథా కానివ్వ కుండా - స్థానిక దీనీ సంస్థలు కండక్ట్ చేసే శిక్షణా క్లాసులకు మీ పిల్లల్ని పంపించాలి. వీటన్నింటితో పాటు పిల్లల హోంవర్క్‌ను, వారి దిన చర్యలను శ్రద్ధగా వాచ్ చేస్తూ ఉండాలి.

తండ్రులు తమ ఇంటికి దూరంగా ఉన్నప్పుడు పిల్లల్ని కనిపెట్టుకుని ఉండాల్సిన బాధ్యత తల్లులపై అధికంగా ఉంటుంది. అయినాసరే అడుగడుగునా తండ్రుల గైడెన్స్ అవసరం. కాబట్టి మీరు తరచూ ఇంటికి ఫోన్ చేసి పిల్లల చదువు సంధ్యల గురించి ఆరాతీయటంతో పాటు, వారు నమాజు చేస్తున్నారో లేదో నిలదీసి అడగాలి. మస్జిద్‌కు వెళ్ళి మరీ నమాజు చేస్తున్నారా లేదా అని మగపిల్లల్ని అడగాలి. అమ్మ మాట వినాలని పిల్లలకు తాకీదు చేస్తూం డాలి. అలాగే - "మన పిల్లలే మన అసలు ఆస్తి" అని భార్యకు పదే పదే నొక్కి చెబుతుండాలి.

బ్రతుకు తెరువుకోసం విదేశాలకు వెళ్ళిన చాలా మంది సోదరులు ఆర్థికంగానైతే బాగానే ఉంటారుగాని పిల్లల శిక్షణలో మాత్రం వెనుకంజ వేస్తారు. తత్కారణంగా వారి పిల్లలు నైతికంగా దెబ్బతింటారు. వారిలో విచ్చలవిడితనం వచ్చేస్తుంది. ఇంట్లో డబ్బు ఉంటుంది. అడగంగానే పాకెట్ మనీ అమ్మ ఉంటుంది. టెన్త్ పూర్తి కాక ముందే చేతిలో మొబైల్ ఫోన్, మోటర్ బైక్ వచ్చేస్తుంది. దాంతో పిల్లల ఊహలకు రెక్క లొచ్చేస్తాయి.

## ప్రవాసాంధ్ర సోదరా!

మీరు గనక శ్రద్ధ వహిస్తే, అక్కడ మీ ఇల్లాలు కూడా మీ పిల్లల్ని అదుపులో ఉంచి, సంస్కారవంతుల్ని చేయగల్గుతుంది. వర్తకం నిమిత్తం దూర దేశాలకు వెళ్ళే ఎంతో మంది పురుషుల ధర్మపత్నులు తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును ఇవ్వగలిగారని చరిత్ర చెబుతోంది. హజ్రత్ సుఫియాన్ సౌరీ (రహ్మా) గారి తల్లినే చూడండి, పేదరికంలో మ్రగ్గుతూ కూడా దూది ఏకి తన కొడుకుని చదివించారామె. పైగా ఆమె తన పిల్లాడికి తరచూ చెబుతుండేది - "నాయనా! నువ్వు ఎప్పుడు పది వాక్యాలు నేర్చుకున్నా, వాటి ద్వారా నీ భక్తిలో, నభ్యతా సంస్కారాల్లో, వినయ వినమ్రతలలో ఏపాటి ఎదుగుదల వచ్చిందో బేరీజు వేసుకో. ఒకవేళ ఎదుగుదల లేకపోతే ఈ చదువు వల్ల నీకు కలిగింది కీడేగాని, మేలు కాదు అని గుర్తుం చుకో".


ఇమామ్ మాలిక్ (రహ్మా) గారి గురువు అయిన రబీఅతుర్రాయ్ (రహ్మా) ఉదాహరణను తీసుకోండి - ఈయన పసివాడుగా ఉన్నప్పుడు తండ్రి 30 వేల దీనార్లు ఇల్లాలికి ఇచ్చి, ఒక ముఖ్యమైన పనిపై విదేశానికి వెళ్ళిపోయారు. బాధ్యత గల ఆ ఇల్లాలు ఆ డబ్బంతా ఆ అబ్బాయి చదువు కోసం వెచ్చించి అతన్ని ఆ కాలపు సాటిలేని మేటి విద్వాంసునిగా తీర్చి దిద్దింది. సుదీర్ఘకాలం తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన తండ్రి, తన కుమారుని పాండిత్యాన్ని చూసి ఆనందంతో పరవశించిపోతాడు.

పసిపిల్లలు ప్లెయిన్ పేపర్ లాంటివారు. దానిపై ఏది గీస్తే అదే ముద్రపడుతుంది. **"మొక్కై వంగనిది మ్రానై వంగునా!?"** అన్న సామెతను జ్ఞప్తికి తెచ్చుకోండి. లేత వయసులో మనం మన పిల్లల్ని ఎలా మలచుకుంటే అలాగే తయారవుతారు. కాబట్టి తల్లి దండ్రులు తమ పిల్లల మంచి శిక్షణకై జాగ్రత్తలు తీసుకోవటంతోపాటు వారు స్వయంగా పిల్లలకు ఆదర్శప్రాయులుగా ఉండాలి. విదేశాల్లో ఉండే తండ్రులు వీలైనంత త్వరగా సెలవుపై వెళుతుండాలి. సాధ్యమైనంత ఎక్కువ సమయం ఆలుబిడ్డలతో గడపాలి.

(1) ఇంట్లో చిన్నతనం నుంచే పిల్లలకు 'సలాం' చేయటం నేర్పాలి. కలిమాలు కంఠస్థం చేయించటంతోపాటు వాటి భావార్థాన్ని విడమరచి చెప్పాలి. (2) బాల్యం నుంచే నమాజు పట్ల శ్రద్ధాసక్తులను కలిగించాలి. ఏడేండ్లు వచ్చాక నమాజు చేయమని ప్రోత్సహించాలి. పదేండ్ల ప్రాయంలో నమాజుకై గట్టిగా ఆదేశించాలి. ఈ వయసులో పిల్లల పడకలను కూడా వేరుచేయాలి. (3) దుర్భాషలకు, దురాచారాలకు, చెడు సావాసాలకు వారిని దూరంగా ఉంచాలి. (4) ముఖ్యంగా ఆడ పిల్లల్లో సిగ్గు, బిడియం, అణకువను చిన్నప్పటి నుండే ఒంట బట్టించాలి. పసితనం నుంచే సంస్కారవంతమైన వస్త్రధారణ గురించి నొక్కి చెప్పాలి. (5) పిల్లలను చాలా జాగ్రత్తగా, సూక్ష్మదృష్టితో గమనిస్తూ ఉండాలి. అంటే - వారి సావాసాలు ఎలాంటివి? ఎక్కువ సమయం వారు ఎవరితో గడుపుతున్నారు? వారి రోజువారి కార్యక్రమాలేమిటి? లాంటి విషయాలను అబ్జర్వ్ చేస్తుండాలి.

వేళాకోళానికి కూడా పిల్లల ముందు చెడు అనరాదు. ఆడిన మాట తప్పరాదు. అబద్ధాలు చెప్పరాదు. వెకిలి సైగలు చేయరాదు. ఇతరులను చెడు పేర్లతో పిలవరాదు. పైగా పిల్లల వల్ల జరిగే తప్పులను ఎప్పటికప్పుడు సరిదిద్దుతూ ఉండాలి. వారు చేసే ప్రతి మంచి పనిపై 'శభాష్!' అంటూ ఎంకరేజ్ చేస్తుండాలి.

- రీమా నూర్ (ఖైతాన్)



# భక్తి విశ్వాసాల బీజం మొలకెత్తినపుడు...

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం

పరమ పవిత్రుడైన అల్లాహ్ ఆలి ఇమ్రాన్ సూరాలో ఇలా ఆజ్ఞాపిస్తున్నాడు - **"యా అయ్యుహల్లజీన ఆమనుత్తఖుల్లాహ హఖ్ఖ తుఖాతిహీ వలా తమూతున్న ఇల్లా వ అంతుమ్ ముస్లిమూన్".**

(3:102)

(విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు ఏ విధంగా భయపడాలో ఆ విధంగా భయపడండి. ముస్లిములుగా తప్ప మీరు మరణించకండి)

పై వాక్యాలు ఖుర్‌ఆన్ వెలుగులో మనకేమాజ్ఞాపిస్తున్నాయో చూద్దాం. 'ఓ విశ్వసించిన ప్రజలారా!' అని సంబోధించబడింది. విశ్వాసం (ఈమాన్) అనే పదము 'అమన్' అను పదము నుండి వెలువడింది. అమన్ అంటే శాంతి భద్రతలు, ఎలాంటి భయాందోళన లేకుండా ఉండడం అని అర్థం. ఈమాన్ అంటే నమ్మకం, భరోసా, హృదయ స్వీకారం మరియు అమలు ద్వారా దాని ధృవీకరణ అని అర్థం. ము-మిన్ అనగా విశ్వాసి లేక శాంతి భద్రతలతో కూడిన వాడు, భయాందోళనల నుండి సురక్షితంగా ఉన్నవాడు అని కూడా అర్థం.

ఖుర్‌ఆన్ పరిభాషలో విశ్వాసి తనను తాను సరిదిద్దుకునేవాడు, అల్లాహ్ ఆజ్ఞలను బాధ్యతతో పాటించేవాడు, అల్లాహ్ కోరిన గుణాలను తనలో ఇమిడింపజేసుకునేవాడు, సర్వదా కృతజ్ఞతా భావంతో నిండి ఉండేవాడు, నిరాశా నిస్పృహలకు జీవితంలో చోటివ్వనివాడు, సదాచార సంపన్నుడు, శారీరక పరిశుద్ధతతోపాటు తన విశ్వాసాన్ని అన్ని విధాలా మాలిన్యం నుండి కాపాడుకునేవాడు అని అర్థం.

నిజానికి శాంతి, విశ్వాసం అనగా నమ్మకం కూడాను, ఈ నమ్మకమనేది ఎవరిపై లేక ఏ అంశాలపై అనే ప్రశ్న జనిస్తుంది మనసుల్లో. ఐతే విశ్వాసాంశాలు ఆరు : (1) అల్లాహ్ పట్ల విశ్వాసం, (2) దైవదూతల పట్ల విశ్వాసం, (3) ప్రవక్తలపట్ల విశ్వాసం, (4) ఆకాశ గ్రంథాలపట్ల విశ్వాసం, (5) మరణానంతర జీవితంపై విశ్వాసం, (6) విధివ్రాతపట్ల విశ్వాసం.

విశ్వాసులు ఈ విషయాలను హృదయపులోతుల్లోనుంచి నమ్మడమే కాక తమ చేతల ద్వారా నిరూపించుకోవాలి. అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (స.అ.వ.స) పట్ల విధేయులై ఉండే వారై, ధర్మాన్ని స్థాపించేవారై, నమాజు చేసేవారు, జకాతు చెల్లించేవారై, దౌర్జన్యంగా ఇతరుల సొమ్ము కాజేసేవారు కాక, అల్లాహ్ ఇచ్చిన ధనాన్ని అల్లాహ్ మార్గంలో ఇష్టపూర్వకంగా ఖర్చు పెట్టేవారై, పిసినారితనానికి గురికానివారై, అల్లాహ్ ఇచ్చిన శుభాలపై గర్విష్ఠులు కాక, కృతజ్ఞతా భావంతో వినమ్రులై, మంచిని ఆజ్ఞాపించి చెడును వారించేవారై, అల్లాహ్ అభీష్టాన్ని కోరేవారై, అల్లాహ్ ఆజ్ఞలను మనసా వాచా కర్మణా తమ జీవితంలో ప్రవేశ పెట్టేవారై ఉంటారు.

ఇంకా వారు తమ తల్లిదండ్రులతో, పొరుగువారితో, బంధువులతో, అనాథలతో, పేదసాదలతో, ప్రయాణీకులతో బానిసలతో చక్కగా మెలిగి, వారిని ఆదుకుని ఆశ్రయం కల్పించేవారై ఉంటారు. ఈ కార్య నిర్వహణల్లో ఏదైనా తప్పు జరిగితే అల్లాహ్‌ను "ఓ అల్లాహ్ ఏమరుపాటులో జరిగిన మా తప్పులను మన్నించ" మని కోరుతారు. ఇలాంటి వారికి ప్రపంచంలోనూ మరియు పరలోకంలోనూ చీకూ చింతా ఉండవు. వారికి ఎల్లప్పుడూ ఇహపర సాఫల్యాలే ఇన్షా అల్లాహ్.

విశ్వాసం (ఈమాన్) తరువాత పరమ పవిత్రుడైన అల్లాహ్ తఖ్వా యొక్క ప్రాముఖ్యతను తెలియ పరుస్తున్నాడు. **'ఇత్తఖుల్లాహ హఖ్ఖ తుఖాతిహీ'** - అల్లాహ్‌కు ఏ విధంగా భయపడాలో ఆ విధంగా భయపడండి అని.

తఖ్వా 'వఖా' నుండి వెలువడింది. దీని అర్థం ఎక్కువగా జాగ్రత్త పడడం, తనను తాను సురక్షితంగా ఉంచుకోవడం, అల్లాహ్ నియమించిన హద్దులు మీరకుండడం, కలిమిలో లేమిలో కూడా అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడం, అల్లాహ్ **అవిధేయతకు** భయపడడం, అల్లాహ్ శాసనాన్ని భంగపరచుటకు భయపడడం, న్యాయానికి ప్రతీకపడం, వాగ్దానాలను పూర్తిచేయడం, బంధు మిత్రుల సంబంధాలను బలపరచడం, తమ కోపాన్ని అణచివేయడం, ఇతరుల తప్పులను మన్నించడం, హరాం హలాల్‌లలోని అంతర్యాన్ని తెలుసుకుని ఆచరించడం అనేది తఖ్వా, అల్లాహ్ యొక్క భయభీతి.

తఖ్వా అనేది ఒక స్పందన, స్పృహ. సకల లోకాలకు ప్రభువైన అల్లాహ్ నాకు అతి చేరువలో ఉన్నాడు, నా ప్రాణ నాళికన్నా దగ్గరగా ఉన్నాడు, నా ఊహ, నా చర్య అంతా గమనించేవాడు, నా మంచి చెడు కర్మలను వ్రాసుకునే ఇద్దరు భటులను నాపై నియమించి ఉంచాడు. వారు ప్రతీదీ భద్రంగా వ్రాసి పెడుతున్నారు. ఆయన ప్రళయదినాన సమస్త మానవజాతి ముందు మరియు మహోన్నతుడైన అల్లాహ్ సమక్షంలో నా తప్పొప్పులు బహిర్గతం చేయబడతాయి అనే స్పృహ. మన హృదయం నిరంతరం దిక్సూచి సూదిలా అల్లాహ్ వైపే ఉండాలి. ఒకవేళ కాస్సేపటికి సమయ సందర్భాలకు అనుకూలంగా ఇటూ అటూ అయినప్పటికీ మరలా అల్లాహ్ వైపునకే తిరగ గలగాలి. అప్పుడే ఆ హృదయం భయభక్తుల హృదయంగా పరిగణించ బడుతుంది.

ఒకసారి హజ్రత్ ఉమర్ (ర.అ) హజ్రత్ కఆబ్ (ర.అ) ను 'తఖ్వా అనగా నేమి?' అని అడిగినప్పుడు వారు ఇలా జవాబిచ్చారు: "ఒక ఇరుకైన దారి ఇరువైపులా ముళ్ళకంచెలతో నిండి ఉన్నప్పుడు ఏ వ్యక్తి అయినా తన దుస్తులను వాటిలో చిక్కుబడకుండా జాగ్రత్తపడుతూ ముందుకు సాగిపోవటం. ఆ జాగ్రత్తే తఖ్వా". ఇలాంటి 'తఖ్వా' కొన్ని క్షణాలపాటో లేక కొన్ని సందర్భాల్లోనో కాక సర్వదా ఉండాలి. అప్పుడు ఆ వ్యక్తి అస్తిత్వం లోకానికి లాభదాయకమవుతుంది. అతని వల్ల ఎవరికీ ఎలాంటి కీడు కలగదు. అతని ఉనికి చల్లని నీడను, ఆక్సిజన్‌ను ఇచ్చే మహా వృక్షం లాంటిదవుతుంది. దాని నీడలో ఎల్లరూ సేద తీరుతారు. అతని జీవితం మానవత్వాన్ని పరిమళించే సుధా ఝరి అవుతుంది. దాన్ని అందరూ ఆస్వాదిస్తారు.



# వడ్డీ

## ఇవ్వటం, పుచ్చుకోవటం, సాక్షులుగా ఉండటం - అంతా నిషిద్ధమే



1- హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వడ్డీ తీసుకునే వారినీ, ఇచ్చేవారినీ, ఈ లావాదేవీలను గురించి వ్రాసేవారినీ, దీనికి సాక్షులుగా ఉండేవారినీ ధూత్కరించారు. ఆయన (స) ఇంకా ఇలా అన్నారు- (ఈ పాపాన్ని మూట కట్టుకోవడంలో) వీరంతా సమానులే. (ముస్లిం - బుకారీలలో అబూ జుహైఫా (రజి)చే ఉల్లేఖించబడిన హదీసులో కూడా ఇలాగే ఉంది).

### సారాంశం

అరబీలో 'రిబా' అనే పదం వచ్చింది. రిబా అంటే అధికం, పెంపుదల అని అసలు అర్థం. లావాదేవీల సందర్భంగా ఒక వస్తువును లేదా పైకాన్ని ఒక నిర్ణీత కాలానికిగాను ఇచ్చి, దానిపై ఎక్కువ మొత్తం పుచ్చుకోవటమే రిబా. దీనినే మన నాట వడ్డీ అంటాము. ఈ వడ్డీ ఇస్లాంలో నిషిద్ధం. దాన్ని ఇవ్వటం, పుచ్చుకోవటం, ఈ వ్యవహారంలో దస్తావేజులు, నోటులు వ్రాయటం, దీనికి సాక్ష్యంగా ఉండటం- అన్నీ అధర్మమే. ఇలాంటి వారందరినీ దైవప్రవక్త (స) శపించారు. దివ్య ఖుర్ఆన్‌లో ఇది హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేయబడింది. ఈ వడ్డీ వ్యవహారాన్ని మానుకోని వారిపై అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) తరఫున యుద్ధ ప్రకటన గావించబడింది, ఇది ఎంత శాపగ్రస్తమైన వ్యవస్థ అంటే యావత్తు ప్రపంచ ప్రజలు దీని వాతనపడి కోలుకోలేని స్థితిలో ఉన్నారు. ఆ శాపం నుండి బయట పడటానికి ముస్లింలు చిత్తశుద్ధితో ప్రయత్నించాలి.

2 - దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) ఉల్లేఖించారు: ఆయన (స) ఇలా ప్రవచించారు - వడ్డీలో డెబ్బయి మూడు స్థాయిలున్నాయి. వాటిలో అత్యంత హీనమైన స్థాయి (దశ) యొక్క పాపం; ఒక వ్యక్తి తన కన్న తల్లిని పెళ్ళాడటం వంటిది. వడ్డీ యొక్క అత్యంత తీవ్ర స్థాయి పాపం ఒక ముస్లిం పరువు ప్రతిష్ఠలను మంట గలపటం. (దీనిని ఇబ్నె మాజ సంక్షిప్తంగానూ, హాకీమ్ సంపూర్ణంగానూ వివరించారు. వారు దీనిని ప్రామాణికమైన హదీసుగా కూడా పేర్కొన్నారు)

### సారాంశం

వడ్డీ వ్యవస్థ ఎంత నీచమైనదో, జుగుప్సాకరమైనదో ఈ హదీసు ద్వారా చెప్పబడింది. అలాగే సాటి ముస్లిం చేయని ఒక పని గురించి అతని పరోక్షంలో చెప్పుకోవటం, మర్యాదస్థులైన వారిని రచ్చకీడ్చి వారిపై నీలాపనిందలు మోపటం ఎంత ఘోరమైన తప్పిదమో కూడా ఇందులో చెప్పబడింది. ఇతరుల పరువు ప్రతిష్ఠలను మంట గలపాలన్న దుర్బుద్ధి మన వారిలో మరీ ఎక్కువైపోయింది. ఈ రోగం మన పుణ్యకార్యాలను హరించి - పరలోకంలో - ప్రభువు సమక్షంలో మనల్ని దరిద్రులుగా నిలబెడుతుందన్న సంగతి మరువరాదు.

3- దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) వివరించారు: "బంగారానికి బదులు బంగారమే. కానీ అది బరువులోనూ, నాణ్యత (కేరెట్)లోనూ సరితూగేదై ఉండాలి. వెండికి బదులు వెండి. అయితే అది బరువులోనూ, తరహాలోనూ సరిసమానంగా ఉండాలి. ఇంతకు మించి ఎవరైనా ఎక్కువ తీసుకున్నా, ఎక్కువ ఇచ్చినా అది 'వడ్డీ' అవుతుంది. (ముస్లిం)

– ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

ఇస్లాం శిక్షణ

హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్



# నమాజ్

## నమాజ్ మేరాజ్ కానుక

ఇస్లాం ధర్మానికి రెండవ మూల స్తంభం నమాజ్. దైవప్రవక్త (స) మేరాజ్ (గగన యాత్ర) చేసిన రాత్రి ఆయనపై నమాజ్ విధిగా చేయబడింది. దీని గురించి హదీసులలో ఈ విధంగా వివరించడం జరిగింది.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: దైవప్రవక్త (స) మేరాజ్ (గగన యాత్ర) చేసిన రాత్రి ఆయనపై యాభై నమాజులు విధిగా చేయబడ్డాయి. తర్వాత అవి తగ్గుతూ తగ్గుతూ చివరికి అయిదు నమాజులుగా మిగిలాయి. అప్పుడు దేవుని తరఫు నుండి ఈ విధంగా ప్రకటించబడింది: **"ఓ ముహమ్మద్! నేను అడిన మాట తప్పేవాణ్ణి కాను. నీ అనుచర సమాజానికి ఈ ఐదు నమాజులకు బదులుగా యాభై నమాజుల పుణ్యం లభిస్తుంది".**

(అహ్మద్, తిర్మిజీ)

## నమాజ్ ఆదేశం

నమాజ్ గురించి అల్లాహ్ ఇలా ఆదేశించాడు: **"మీరు నమాజును స్థాపించండి".** (దివ్య ఖుర్ఆన్-2: 110)

దైవప్రవక్త (స) ఈ విధంగా ప్రవచించారు: "నమాజ్ ధర్మానికి స్తంభం లాంటిది".

## నమాజు మూలంగా కంటి చలువ ప్రాప్తిస్తుంది

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నమాజు మూలంగా నాకు కంటి చలువ ప్రాప్తిస్తుంది". (అహ్మద్, నసాయి)

దేవుని దృష్టిలో నమాజ్‌కు ఎంతటి ప్రాముఖ్యం ఉందంటే ముస్లిం సమాజానికి దాని గురించి బోధించటానికి ఆయన హజ్రత్ జిబ్రయీల్‌ను దైవప్రవక్త (స) వద్దకు పంపాడు. దైవాజ్ఞ మేరకు జిబ్రయీల్ దైవప్రవక్త (స)కు నమాజు స్వరూప స్వభావాల గురించి వివరించారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) జిబ్రయీల్ తనకు నేర్పిన విధంగా నియమ నిబంధనలకు అనుగుణంగా, నియమిత కాల వ్యవధుల్లో నమాజును ఆచరిస్తూ వచ్చారు. అంతే కాదు....

"మీరు ఏ విధంగానయితే నన్ను నమాజు చేస్తుండగా చూశారో, ఆ విధంగానే మీరూ నమాజ్ చేయండి" అని తన అనుచర సమాజానికి తాకీదు కూడా చేశారు. (బుఖారీ)

కనుక మనం చేసే నమాజ్ దైవప్రవక్త (స) సూచించిన విధానానికి, నియమ నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే అది దేవుని సన్నిధిలో స్వీకృతిని పొందగలుగుతుంది.

దైవప్రవక్త (స) సమక్షంలో ఒక వ్యక్తి 'తాదీలె అర్కాన్'ను (నమాజ్‌ను పూర్తిగా నింపాదిగా నెరవేర్చటాన్ని) పాటించకుండా నమాజ్ చేశాడు. దైవప్రవక్త (స) అతనితో "నువ్వు తిరిగి నమాజ్ చెయ్యి. ఇందాక నువ్వు చేసిన నమాజ్ నెరవేరలేదు" అన్నారు. ఆ వ్యక్తి మూడు సార్లు అదే విధంగా నమాజ్ చేశాడు. మూడుసార్లూ దైవప్రవక్త (స) అతన్ని ఉద్దేశించి అదే మాట అన్నారు. 'నీ నమాజు నెరవేరలేదు. తిరిగి నమాజు చెయ్యి'. ఆఖరికి అతను 'దైవప్రవక్తా! నాకు ఇంతకన్నా బాగా నమాజ్ చేయటం రాదు. మీరే నాకు నమాజ్ చేసే పద్ధతిని బోధించండి' అని విన్నవించుకున్నాడు.

అప్పుడు దైవప్రవక్త (స) ఇలా బోధించారు: "నువ్వు నమాజ్ చేయదలచుకున్నప్పుడు ముందు చక్కగా వుజూ చేసుకో. తర్వాత ఖిబ్లా దిశకు అభిముఖంగా నిలబడి 'అల్లాహు అక్బర్' అను. తర్వాత ఫాతిహా సూరా పఠించు. ఆ తరువాత ఖుర్ఆన్‌లో నీకు గుర్తున్న సూరా గానీ, వాక్యం గాని చదువు. ఆ తర్వాత నింపాదిగా రుకూ చెయ్యి. తిరిగి నింపాదిగా లేచి నిలబడు, తర్వాత నింపాదిగా సజ్దా చెయ్యి, తిరిగి సజ్దా నుండి నింపాదిగా లేచి కూర్చో".

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "రెండవ రకాతు కోసం నిటారుగా లేచి నిలబడు. ఆ తర్వాత మొదటి రకాతులాగే మిగతా రకాతులు కూడా పూర్తి చేసుకో. ఆపై తషహ్హుద్ పూర్తి చేసినాక (మెడ త్రిప్పి) సలాం చెయ్యి" అని దైవప్రవక్త (స) ఆ వ్యక్తికి ఉపదేశించారు. (బుఖారీ - ముస్లిం)


'తాదీలె అర్కాన్'ను పాటించకుండా కాకి పొడిచినట్టు తొందర తొందరగా నమాజ్ చేయటాన్ని దైవప్రవక్త (స) వారించారు, (నసాయి, అబూదావూద్)

## నమాజ్ ఘనత

నమాజ్ ఘనతా విశిష్టతల గురించి వివరిస్తూ దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మీలో ఎవరి ఇంటి ముందయినా సెలయేరు ప్రవహిస్తూ ఉందనుకోండి. ఆ ఇంటి అతను ఆ సెలయేరులో ప్రతి రోజూ అయిదు సార్లు స్నానం చేస్తూ ఉంటే, అతని ఒంటి మీద మురికి మిగులుతుందా?"

అందుకు అనుచరులు "లేదు. అతని శరీరం మీద ఎలాంటి మురికీ మిగిలుండదు" అని బదులిచ్చారు. అప్పుడు దైవప్రవక్త (స) "ఐదు పూటల నమాజు సంగతి కూడా అంతే. అల్లాహ్ వాటి మూలంగా పాపాలను తుడిచి పెట్టేస్తాడు" అని చెప్పారు.

దైవప్రవక్త (స) మరో సందర్భంగా ఇలా అన్నారు: "ప్రతి నమాజు దాని క్రితం నమాజు వరకు, ప్రతి జుమా మరో జుమా వరకు, రమజాను మాసం - సంవత్సరం పొడుగునా జరిగే పాపాలకు పరిహారం అవుతుంది. అయితే అందుకోసం కబాయెర్‌లకు (ఘోర పాపాలకు) మాత్రం దూరంగా ఉండాలి".



## సీరత్ క్విజ్





**ప్రశ్న: నజాషీ రాజు ముస్లింలకు ఇచ్చిన అభయమేమిటి?**
జ: నజాషీ రాజు ముస్లింలను ఉద్దేశించి, "వెళ్ళండి నా రాజ్యంలో ఇక మీరు ప్రశాంతంగా ఉండవచ్చు" అన్నాడు.

**ప్రశ్న: నజాషీ రాజు ఖురైషులతో ఏమన్నాడు?**
జ: వారు తెచ్చిన కానుకలను వారి ముఖాన పడవేసి వారిని వెళ్ళి పోవలసిందిగా ఆజ్ఞాపించాడు.

**ప్రశ్న: ముస్లింల జీవితం అబిసీనియాలో ఎలా సాగింది?**
జ: సంతోషంగా, సురక్షితంగా కొన్ని సంవత్సరాల పాటు వారక్కడ ఉన్నారు. దైవప్రవక్త (స) మదీనాకు హిజ్రత్ చేసిన తర్వాత వారు కూడా మదీనా వెళ్ళిపోయారు.

**ప్రశ్న: మక్కా జీవితంలో దైవప్రవక్త (స) ఇచ్చిన ఇస్లాం యొక్క ముఖ్యమైన సందేశం ఏది?**
జ: తౌహీద్ (ఏకదైవారాధన) సందేశం.

**ప్రశ్న: ఇస్లాం అంటే ఏమిటి?**
జ: ఇస్లాం అంటే స్వయం సమర్పణ, విధేయత, ఆజ్ఞాపాలన అనే అర్థాలొస్తాయి. ఇస్లాం ధర్మం అల్లాహ్‌కు పరిపూర్ణ స్వయం సమర్పణను, ఆయన విధేయతను బోధిస్తుంది.

**ప్రశ్న: 'ఈమాన్' అనగానేమి?**
జ: ఈమాన్ అంటే విశ్వాసం. నాలుకతో ఉచ్చరించి, హృదయంతో నమ్మి, శరీరావయవాలతో ఆచరించడాన్ని ఈమాన్ అంటారు.

ప్రశ్న: 'ఈమాన్' యొక్క కీలక భాగాలు ఎన్ని? అవి ఏవి?
జ: 'ఈమాన్' యొక్క కీలక భాగాలు ఆరు. అవి:
1) అల్లాహ్ పట్ల విశ్వాసం. 2) దైవ దూతల పట్ల విశ్వాసం. 3) దైవ గ్రంథాల పట్ల విశ్వాసం. 4) దైవ ప్రవక్తల పట్ల విశ్వాసం. 5) అంతిమ దినంపై విశ్వాసం. 6) మంచీ చెడు విధివ్రాతలపై విశ్వాసం.

శాంతి ప్రియ

# షైతాన్‌తో ఇంటర్వ్యూ



వలీద్: రోజురోజుకీ సమాజం బొత్తిగా పనికిరాకుండా పోతుంది.
షైతాన్: నువ్వో దేశోద్ధారకుడివి! నీదో సాత్విక ఆలోచనమా! వారి పాట్లు వాళ్ళు పడతారు గాని, నీ సంగతి నీవు చూస్కో చాలు...
వలీద్: నువ్వు ఎన్నయినా చెప్పు... ఎలాగైనా సరే ప్రజల్ని ఈ గండం నుంచి గట్టెక్కించాల్సిందే. వారికి పనికొచ్చే హితవులు చేసి తీరాల్సిందే. హాఁ!
షైతాన్: అబ్బబ్బ...అబ్బబ్బ... ఏం దేశాభిమానం! ఏం ప్రజా శ్రేయం! కోరి మరి తలకొరివి పెట్టించుకుంటానంటే కాదనడానికి నేనెవడ్ని అంటా...
వలీద్: ప్రజల్ని ముప్పు నుండి రక్షించడం ప్రమాదం ఎలా అవుతుంది.? ఇది అందరికీ ప్రయోజనకరమైన కార్యం కదా!
షైతాన్: నంగనాచి తంగుబుర్రలా ఏమి తెలియనట్టు మాట్లాడుతున్నావే! నిజం చెప్పు... నీలో మాత్రం పదవి వ్యామోహం లేదూ? నలుగురూ నిన్ను గొప్పవాణ్ణి అని చెప్పుకోవాలన్న ఆశ లేదు? మరి ప్రదర్శనాబుద్ధి అన్నివిధాల ప్రమాదకరమే కదా! నువ్వెంత చేసినా చిత్తశుద్ధి లేకపోతే బూడిదలో పోసిన పన్నీరే కదా నీ ప్రజాసేవ కార్యాలు. అలా చేస్తే ప్రభువు కూడా నిన్ను మెచ్చుకోడు కదా. మరి నరక కూపంలో నెట్టేస్తాడాయే!
వలీద్: ఏందయ్యో నువ్వు! మెడకేస్తే కాలికి, కాలికేస్తే మెడకేస్తున్నావ్? నీ మాటలతో నా బుర్ర తినేస్తున్నావే. సరే నాక్కావాల్సిన కొందరు వ్యక్తుల సమాచారం అందిస్తావా?

షైతాన్: ప్రముఖుల గురించైనా, ప్రజల గురించైనా నువ్వడగాలే గాని ఇట్టే చెప్పెయ్యను!?

వలీద్: ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫయీ, ఇమామ్ మాలిక్, ఇమామ్ అబూ హనీఫా (రహ్మ) గురించి నీ ఒపీనియన్?
షైతాన్: నన్ను తలెత్తుకు తిరగకుండా చేసింది వీరే. "ఖుర్ఆన్ మరియు హదీసులను గట్టిగా పట్టుకోండి" అని ప్రజలకు చెప్పి నా నోట్లో మట్టి పోశారు. నా కొంప ముంచారోయ్.
వలీద్: ఫిర్‌ఔన్, నమ్రూద్, వలీద్ బిన్ ముగైరా గురించి నీ అభిప్రాయం?
షైతాన్: అలాంటి వారందరికీ నా మద్దతు సదా ఉంటుంది. నా సామ్రాజ్యాన్ని దశ దిశల వ్యాపింపజేసింది ఈ వర్గమేనోయ్.
వలీద్: ఖాలిద్ బిన్ వలీద్, సలాహుద్దీన్ అయ్యూబీ, ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్, ముహమ్మద్ బిన్ ఖాసిమ్?
షైతాన్: వాళ్ళంటేనే నాకు ఒళ్ళు మండుతుంది.

వలీద్: అబూ జహల్, అబూ లహబ్,సల్మాన్ రష్దీ, ఉమ్మె జమీల్, తస్లీమా నస్రీన్?
షైతాన్: మేమందరం ఒకే కుటుంబీకులం. మా అందరి లక్ష్యమూ ఒక్కటే. మానవుల్ని మార్గభ్రష్టుల్ని చేయడం. వీరందరూ మా వ్యవస్థకు వృద్ధివికాసాలు ఇచ్చిన గొప్ప తత్వవేత్తలు...! ఆ మధ్య వీరిలో కొందరికి గొప్పగా సన్మానం కూడా జరిగింది తెలీదూ?

# దైవ ప్రవక్త (స.అసం) సమాధిని మస్జిదె నబవీలోనికి తీసుకోవటంలోని ఔచిత్యం?

**సందేహం: ఇంతకీ మహాప్రవక్త (సఅసం) వారి సమాధిని మస్జిదె నబవీ లోపలికి తీసుకోవటంలోని అంతర్యం ఏమిటి?**

సమాధానం: "యూదులపై, క్రైస్తవులపై అల్లాహ్ శాపం పడుగాక! ఎందుకంటే వారు తమ ప్రవక్తల సమాధులను మస్జిద్ (సాష్టాంగ ప్రణామ స్థలం) గా చేసుకున్నారు" అని మహాప్రవక్త (సఅసం) ప్రవచించారు (బుఖారీ, ముస్లిం).

వేరొక హదీసు ద్వారా కూడా రూఢీ అయ్యేదేమిటంటే హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనానుసారం – ఉమ్మె సలమా, ఉమ్మె హబీబాలిద్దరూ (ర.అన్ హుమా) దైవప్రవక్త (స) దగ్గర ఒక చర్చీ గురించి ప్రస్తావించారు. ఆ చర్చీలో చిత్ర పటాలు, విగ్రహాలు ప్రతిష్ఠించి ఉండటం తాము చూశామని వారు చెప్పగా, ఆయన (సఅసం) ఇలా అన్నారు; "వారు (గ్రంథంగల ప్రజలు) తమలోని పుణ్య పురుషులు చనిపోయినప్పుడు వారి సమాధులపై ఆరాధనాలయాన్ని నిర్మించి, వాటిలో వారి చిత్రపటాలను ఆవిష్కరించేవారు. అల్లాహ్ దృష్టిలో అత్యంత నికృష్ట జనులు వీరే". (బుఖారీ, ముస్లిం).

ఇంకొక హదీసు –

ఇమామ్ ముస్లిం (రహ్మాలై) గారు తన సహీహ్ ముస్లింలో హజ్రత్ జున్దుబ్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఉల్లేఖనాన్ని పొందుపరిచారు. దాని ప్రకారం ఆయనిలా అన్నారు: దైవ ప్రవక్త (సఅసం) చెప్పగా నేను విన్నాను – "జాగ్రత్త! మీకు పూర్వం గతించినవారు తమ ప్రవక్తల, సజ్జనుల సమాధులను ఆరాధనా స్థలాలుగా చేసుకునేవారు. మీరు మాత్రం అలాంటి చేష్టలకు ఒడిగట్టకండి అని నేను మీకు తాకీదు చేస్తున్నాను".

హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం "మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు సమాధులను పటిష్ఠ పరచటాన్ని, వాటిపై కూర్చోవటాన్ని, వాటిపై నిర్మాణాలు చేపట్టడాన్ని వారించారు".

(ముస్లిం)

పైన పేర్కొనబడిన ప్రామాణిక హదీసులను బట్టి ఎట్టి పరిస్థితిలోనూ సమాధులను 'సజ్దా' స్థలాలుగా చేసుకోరాదని స్పష్టంగా విదితమవుతోంది. అలాగే గోరీలపై నిర్మాణం చేయటం, గుంబదులు వంటివి కట్టడం కూడా అధర్మమే. ఎందుకంటే ఇవన్నీ ప్రజలను దేవుని ఏకత్వం నుండి దూరం చేసి, షిర్క్ (బహుదైవోపాసన) కు మార్గం తెరుస్తాయి.

ఇక ప్రవక్త (సఅసం) సమాధిని మస్జిద్ లోపలికి తీసుకోవటం గురించి చెప్పుకుందాం –

దైవప్రవక్త (సఅసం) గానీ, ఆయన గారి ఇద్దరు ప్రియ సహచరులు (అబూబక్ర్, ఉమర్) గానీ వాస్తవానికి మస్జిద్ లోపలి భాగంలో ఖననం చేయబడలేదు. నిజానికి వారు ముగ్గురూ హజ్రత్ ఆయిషా (ర.అన్హా) నివసించే కుటీరంలో ఖననం చేయబడ్డారు.

అయితే మస్జిద్‌కు వచ్చేవారి సంఖ్య ఏటేటా పెరుగుతుండటం వల్ల వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ కాలంలో మస్జిదె నబవీ విస్తృతి జరిగింది. ఆ సందర్భంగా – హి. మొదటి శతాబ్ది చివర్లో – హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి కుటీరం కూడా మస్జిద్‌లో విలీనం చేసుకోబడింది తత్కారణంగా దైవ ప్రవక్త (సఅసం) సమాధితోపాటు, ప్రియ సహచరులిద్దరి సమాధులు కూడా ఆ విలీన స్థలంలో అంతర్లీనమైనాయి. కాబట్టి ఇది మస్జిద్‌లోపల జరిగిన ఖనన సంస్కారం అని చెప్పటం సరైనది కాదు. **– షేఖ్ అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ (రహ్మా)**

## ఫోన్‌లో 'మైనె ఖుబూల్ కియా' అంటే సరిపోతుందా?

**సందేహం: ఈ మధ్య ఇంటర్‌నెట్, ఫోన్ల ఆధారంగా ఎన్నో చోట్ల నికాహ్‌లు (వివాహాలు) జరుగుతున్నాయి. ఈ రకమైన వివాహాలు షరియతు పరంగా ధర్మబద్ధమేనా?**

సమాధానం: నికాహ్‌లో 'ఏజాబ్ వ ఖుబూల్' (ప్రతిపాదన, ఆమోదం) కీలకమైనది. వివాహబంధంలో ఇమిడిపోయే నూతన వధూవరులు కూడా స్వయానా ఈ తంతు జరుపుకోగలరు. లేదా వారిరువురి తరపు 'పెద్ద మనుషులు' కూడా జరిపించగలరు. ఒక సారి దైవప్రవక్త (సఅసం) ఒక వ్యక్తినుద్దేశించి, "నీ వివాహం ఫలానా స్త్రీతో జరిపించమంటావా?" అని అడగ్గా "సరే" నని ఆ వ్యక్తి అన్నాడు. అప్పుడాయన (సఅసం) వారిరువురికీ నికాహ్ జరిపించారు (సుననె అబుదావూద్).

నికాహ్ (వివాహం) కోసం షరీయతు ప్రకారం నాలుగు మూలాంశాలుంటాయి. (1) వధువు అంగీకారం (2) ఆమె సంరక్షకుని అనుమతి (3) మహర్ సొమ్ము నిర్ధారణ (4) సాక్షులు. నికాహ్ సందర్భంగా ఈ షరతులు పూర్తవ్వాలి. అన్యథా అట్టి నికాహ్ సరైనది కాదు.

ఇక ఫోన్ లేదా ఇంటర్‌నెట్ సంభాషణ ద్వారా నికాహ్ విషయానికి వస్తే – అందులో 'ఖుబూల్' చేసే వ్యక్తి గురించి పెళ్ళి కూతురు తరఫువారు 'ఆ వ్యక్తి అతనే' నని నిజ నిర్ధారణ చేయాలి. అంటే ఆ స్థలంలో 'వరుడు' ఉండడు. కానీ దూర భాషణ ద్వారా అతని 'ఆమోదకంఠం' మాత్రం వినబడుతుంది. ఆ వివాహ మహోత్సవానికి విచ్చేసిన వధువు తరఫువారు, సాక్షులు, ఇతర బంధు మిత్రులు ఒక నిర్ధారణకు వస్తారు. ఇలాంటి 'నికాహ్'లో షరీయతు పరంగా ఎలాంటి దోషం లేదు. కాకపోతే ఇంతకు ముందు పేర్కొన బడిన నికాహ్ 'నియమ నిబంధనలు' పరిగణనలోకి వచ్చి ఉండాలి. (నిజము దేవుడెరుగు)

**–షేఖ్ అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ (రహ్మాలై)**

# సాఫల్యం వైపునకు రారండి!

ఓ హజ్రత్ బిలాల్ సాహెబ్!
రజియల్లాహు తాలా అన్హు
ఎంత గొప్ప పిలుపిచ్చావయ్యా!
మహా శక్తిమంతుడైన అల్లాహ్
నీ ఎదలో నీ కంఠ స్వరంలో
ఈ భూగోళాన్ని పునీతం చేయు
దివ్య సందేశం 'అజాన్' పిలుపు
ప్రతి చరణం
సూర్య చంద్రులతో భూ ఆకాశాలతో
పంచ భూతాలతో తులతూగే
గొప్ప మధురమైన సందేశం
ఆ చరణాల ప్రవాహంలో
మహా సముద్రం ఉప్పొంగి
సమస్త జీవ కోటికి
అదృశ్య చైతన్యం కల్గించే ఏకైక శక్తిని
నీవు, తన్మయత్వంతో ఇచ్చిన అజాన్ పిలుపును
మేము, వీనుల విందుగా ఆలకించాము
పులకించుచూ
సర్వ శక్తి సంపన్నుడు, సృష్టికర్త
అల్లాహ్, దివ్య నామ స్మరణకు సంసిద్ధులమైనాము

ఆహా, ఎంతటి మధురమైన స్వరం అజాన్
తెలతెల వారకనే నవ నాడులను చైతన్యపర్చి
నిద్ర మత్తు నుండి మేల్కొలుపుతూ
సమస్త జీవ కోటికి శుభము గల్గే
దైవ సన్నిధికి ఆహ్వానం,
ఆ స్వరంలో మాధుర్యముంది
ఆ ఆహ్వాన పలుకుల్లో
ఓ నిస్వార్థ, నీతి నియమ, నిర్మలత్వముంది

దైవ సన్నిధిలో
సమస్త దోషాలను పాపాలను ప్రక్షాళన గావించుకుని
ప్రసన్నమయ్యే శుభ తరుణం సత్వినియోగంకై ఆ పిలుపులో
శుభ సూచకం, పారదర్శకత తొణికిసలాడుతోంది
"రోజూ వినే పిలుపే
భూగోళం పర్యాప్తముగా నిత్యం
అల్లుకున్న సుమధుర స్వర ఝరి
ఈ సృష్టిని, ప్రతి రోజు
పాప విముక్తిని చేయు మహా శక్తి ఈ పిలుపే"

ఆ పిలుపే కదా
పక్షులు తెలతెలవారగనే
తమ తమ గొంతులు సవరించి
ఆ అజాన్ పిలుపులోని మాధుర్యాన్ని
తమ స్వరాలకు పూసుకుని
కిలకిలా రావంతో
ఈ లోకానికి, చక్కటి సంగీతాన్ని సమకూర్చేవి!
ఆ పిలుపే కదా సమస్త లోకంలో
పేరుకు పోయిన పాపాన్ని ఏ రోజుకారోజు కడిగి
ముత్యంలా ప్రకాశింపజేసే శక్తి ప్రసాదించేది

రండి, రాత్రి వరకు
గడచిన కాలంలో మీ అంగాంగము
పాపములో కూరుకుపోయిన బురదను
పరిశుభ్రం చేసుకుని
భవిష్యత్తును సరిదిద్దుకోండి
రండి, అల్లాహ్ దర్బారులో
మనం, మన పాపాలకు ప్రాయశ్చిత్తము పలికి
నూతనంగా స్వచ్ఛమైన
జీవితం కోరి కోరి మరీ ప్రార్థిద్దాం!

– జి. ఓబుల్ రెడ్డి (ముహమ్మద్)

# దివ్య ఖుర్ఆన్ మానవీయ జీవనికి ధర్మదాయి




**మా**నవుడు సన్మార్గాన్ని వదలి సత్యం, ధర్మం, న్యాయాన్ని మరచి అంధకారంలో కొట్టు మిట్టాడుతూ, జీవితాన్ని వెళ్ళబోస్తున్నప్పుడు మానవునికి జీవనజ్యోతిలా వెలుగుతూ రుజుమార్గాన్ని చూపింది దివ్య ఖుర్ ఆన్. పవిత్ర గ్రంథమయిన ఖుర్ఆన్ గురించి అల్లాహ్ ఈ విధంగా తెలియ జేస్తున్నాడు: **"యదార్థం ఏమిటంటే ఈ ఖుర్ఆన్ పూర్తిగా సరియైన మార్గాన్ని చూపుతుంది". (బనీ ఇస్రాయీల్ 9,10)**

ఈ పవిత్ర ఖుర్ఆన్ ఎవరి తరపున వచ్చింది? మానవునికి ఎలా లభ్యమయింది? దీన్ని ఎవరు సృష్టించారు? మానవుడు సృష్టించడానికి వీలుకాని గ్రంథం ఇది. ఈ గ్రంథానికి మూలకర్త ఎవరు? ఒక్కసారి ఆలోచించు, సర్వలోకాలకు మూలకారకుడై సమస్త జగత్తును, సర్వ మానవాళిని నడిపిస్తూ ఆకాశంలో సింహాసనం మీద ఉన్న, పరమేశ్వరుడు అయిన అల్లాహ్ సృష్టించాడు – ఆ గ్రంథం మానవాళికి ఏ విధంగా చేరిందంటే దైవదూతల్లోకి పెద్దవారైన జిబ్రయీల్ (అస్సలామ్) ద్వారా. అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) పై పవిత్ర దైవ గ్రంథమైన ఖుర్ఆన్ సందేశవాక్కు 23 సంవత్సరాల కాలంలో పూర్తి అయింది.

ఏకేశ్వరుడు, సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ మానవునికి ఈ విధంగా తెలియజేస్తున్నాడు: **"అల్లాహ్ పంపిన వహీ, ఆయన చేసిన బోధనలు లేకుండా రచించబడే వస్తువు కాదు ఈ ఖుర్ఆన్, ఇది పూర్వం వచ్చిన దానికి ధృవీకరణ. అల్ కితాబ్‌కు వివరణ, ఇది విశ్వ పాలకుని తరుపు నుండి వచ్చిందనే విషయంలో ఎంతమాత్రం సందేహం లేదు".**

(యూనుస్ – 37)

దివ్యఖుర్ఆన్ అవతరించిన రాత్రి వెయ్యి నెలలకంటే గొప్పది. ఆ రాత్రి ఎప్పుడంటే ఖచ్చితంగా చెప్పలేం. రమజాన్ మాసంలో, ఆఖరి 10 రోజుల్లో ఒక రాత్రి అని మనకు (హదీస్‌ల ద్వారా) తెలుస్తుంది. ఈ పవిత్రమైన ఖుర్ఆన్ మధురానుభూతితో పారాయణం చేస్తుంటే రోజులు ఏ విధంగా గడచిపోతాయో తెలియదు. రమజాన్ నెలలో ఉపవాసాలు పాటిస్తే ఎంతో పుణ్యం లభిస్తుంది.

సర్వేశ్వరుడు అయిన అల్లాహ్ రమజాన్ నెల గురించి ఈ విధంగా తెలియజేస్తున్నాడు: "పవిత్ర ఖుర్ఆన్ అవతరించిన నెల రమజాన్ నెల. మానవులందరికీ ఆ గ్రంథం మార్గదర్శకం. రుజుమార్గం చూపే, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి. కనుక ఇకనుండి రమజాన్ నెలను పొందే వ్యక్తి ఆ నెల అంతా విధిగా ఉపవాసాలు ఉండాలి". (అల్ బఖర 185)

దివ్యఖుర్ఆన్ మానవున్ని హెచ్చరిస్తుంది: "మానవుడా! నువ్వు అవిశ్వాసానికి పాల్పడితే పరలోకంలో అల్లాహ్ దగ్గర శిక్ష తప్పదని." దివ్యఖుర్ఆన్ అవిశ్వాసి (ధర్మం తప్పినవాని గురించి) గురించి ఈ విధంగా బోధిస్తుంది:

**అవిశ్వాసానికి పాల్పడిన వారికి నరకాగ్ని ఉన్నది. వారు చనిపోవాలి అనే తీర్పూ ఇవ్వబడదు. వారి నరక యాతనను ఎంతమాత్రం తగ్గించటమూ జరగదు. ఇలా మేము అవిశ్వాసానికి పాల్పడే ప్రతి వ్యక్తికీ ప్రతిఫలం ఇస్తాము. వారు అక్కడ పెడబొబ్బలు పెడుతూ ఇలా అంటారు. "మా ప్రభూ! మమ్మల్ని ఇక్కడ నుండి బయటకు తియ్యి. మేము పూర్వం చేసిన పనులకు భిన్నంగా మంచి పనులు చేయటానికి" (వారికి ఇలా జవాబు ఇవ్వబడుతుంది) గుణపాఠం నేర్చుకోదలచినవాడు గుణపాఠం నేర్చుకోవటానికి సరిపడిన ఆయుష్షును మేము మీకు ఇవ్వలేదా! ఇక్కడ యాతనను రుచి చూడండి. దుర్మార్గులకు ఇక్కడ సహాయం చేసేవాడెవ్వడూ లేడు. (ఫాతిర్ 36,37)**

## అవిశ్వాసిగా జీవించకు

సర్వలోకాన్ని సృష్టించిన ఏకేశ్వరుడు అయిన అల్లాహ్‌ను మరచి ఎందరో దేవుళ్ళు ఉన్నారని తలచి, బహుదైవారాధన (షిర్క్)కు పాల్పడకు , వ్యభిచారం దరిదాపులకు కూడా పోకు. అది అతి నీచకరమైన బహుచెడ్డ మార్గం, దొంగతనాలు చేయకు, పరాయి సొమ్ము పాములాంటిది. హత్యలు చెయ్యకు, మద్యం పుచ్చుకోకు, జూదం ఆడకు, దేవుడి మీద దొంగ ప్రమాణాలు చెయ్యకు, పిసినారితనం చూపకు, స్త్రీలపై అభాండాలు మోపకు, పక్కవారి ఆస్తిని కాజేయకు, సాటి మనిషిని ఎగతాళి చెయ్యకు, పక్షిని అతించకు, స్త్రీలను పురుషులను హింసించకు అని ఖుర్ఆన్ హెచ్చరిస్తోంది.

(1) బహుదైవారాధన (షిర్క్) గురించి ఈ విధంగా తెలియచేస్తుంది: అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్‌ను మాత్రమే (అన్ నిసా 47,48)

**(2) వ్యభిచారం:** "వ్యభిచారం దరిదాపులకు కూడా వెళ్ళకండి. అది అతి నీచకార్యం, బహు చెడ్డ మార్గం". (బనీ ఇస్రాయీల్ 32)

**(3) దొంగతనం:** దొంగ – స్త్రీ అయినా పురుషుడైనా ఉభయుల చేతులూ నరకండి. ఇది వారి సంపాదనకు ప్రతిఫలం. అల్లాహ్ తరుపు నుండి గుణపాఠం నేర్పే శిక్ష. (అల్ మాయిద)

# విహార యాత్ర


## భవన నిర్మాణం కన్నా శీల నిర్మాణం మిన్న











## ఇక్బాల్ భాయి ఇక లేరు

30 ఏండ్లుగా కువైట్‌లో ఉంటున్న తూ.గో.జిల్లా దిండి గ్రామ వాస్తవ్యులు ముహమ్మద్ ఇక్బాల్ మనకిక లేరని తెలియజేయటానికి చింతిస్తున్నాము- "ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్". 30 ఏండ్ల క్రితం ఆయన తన స్వస్థలంలోనే ఈమాన్ భాగ్యాన్ని ఆస్వాదించారు. పూర్వాశ్రమంలో ఆయన హైందవులు. తర్వాత క్రైస్తవం స్వీకరించారు. ఆ తర్వాత ఇస్లాం ధర్మాన్ని గ్రహించారు. ఆయనతో పాటు ఆయన కుటుంబీకులంతా విశ్వాస భాగ్యాన్ని ఆస్వాదించారు. ఇక్బాల్ భాయి వయస్సు 62 సంవత్సరాలు.

గత 30 సంవత్సరాలుగా ఆయన కువైట్‌లో డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తూ వచ్చారు. అనారోగ్య కారణాల వల్ల నెల రోజుల క్రితమే తన స్వగ్రామానికి ప్రయాణమయ్యారు. 14-05-2009 వ తేదీ గురువారం నాడు తన నిజ ప్రభువు సన్నిధికి సాగిపోయారు. కారుణ్య ప్రభువైన అల్లాహ్ ఆయన్ని మన్నించి, జన్నతుల్ ఫిర్‌దౌస్‌లో చోటు కల్పించాలని, ఆయన కుటుంబీకులకు ఉత్తమ సహనాన్ని ప్రసాదించాలని 'నెలవంక' ప్రార్థిస్తోంది.



# కమ్యూనిజంకంటే ఉన్నతమైన వ్యవస్థ

పెట్టుబడిదారీ వ్యవస్థ వెన్నెముకను విరిచే సిద్ధాంతాలు రెండు - ఒకటి కమ్యూనిజం, రెండోది ఇస్లాం.

ఇక్కడ (భారత దేశంలోని) కమ్యూనిస్టుల్లో కొంతమంది మాత్రమే 'దాస్ కాపిటల్' (Das Capital)ను లోతుగా అధ్యయనం చేసి ఉంటారు. మార్క్స్ సిద్ధాంతాలలో 'మిగులు విలువ' ( Surplus Value ) అన్నదొకటి. ఈ సూత్రాన్ని మార్క్స్ మూడు గ్రంథాల్లో విశదీకరించాడు.

పెట్టుబడిదారుడు పెట్టుబడి పెడతాడు. శ్రామికుడు తన శ్రమతో ఆ పెట్టుబడికి లాభం చేకూరుస్తాడు. ఈ లాభం అసలు మూల ధనం కంటే అధికంగా ఉంటుంది. ఈ అధికాదాయంతో పెట్టుబడిదారుడు మరో ఫ్యాక్టరీ స్థాపనకు పూనుకుంటాడు. ఈ విధంగా అతడు సామాన్యుల్ని దోచుకుంటాడు- ఇదీ కమ్యూనిజం వాదన, ఈ స్థితిలో కమ్యూనిజం రంగప్రవేశం చేస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు అసలు బలమైన ఈ 'మిగులు విలువ'ను అంతమొందించగోరుతుంది. అది పెట్టుబడిదారీ వ్యవస్థను తుదముట్టించి ఉత్పత్తి సాధనాలన్నింటినీ జాతీయం చేసుకుంటుంది.

పరిశ్రమలను జాతీయం చేయడం వల్ల సమస్య పరిష్కృత మవుతుందా? అన్నది ఆలోచించవలసిన విషయం. జాతీయం చేయబడిన పరిశ్రమల నుండి కూడా మిగులు విలువ ఉత్పన్నమవుతుంది. ఈ లాభాన్ని ఎటు తరలించాలన్నది ప్రశ్న. నేడు ఆచరణాత్మకంగా ఈ లాభం ఏమవుతుంది అన్నదాన్ని కూడా చూడాలి.

ముందు పరిశ్రమలు జాతీయం చేయబడతాయి. వాటినుండి వచ్చే లాభంలో కొంత భాగం కార్మికులకు ఇవ్వబడుతుంది. మిగతా ప్రజలకు ఏమీ లేదు.

ఏదైనా పరిశ్రమ వల్ల వచ్చే లాభంలో కేవలం ఆ పరిశ్రమలో పని చేసే కార్మికులకు మాత్రమే భాగం లభిస్తుంది. ఇతర రంగాల్లో పని చేసే శ్రామికులు, దేశంలోని నిరుపేదలు, నిరాధార జీవులకు ఇందులో ఎలాంటి వాటా లేదన్న మాట. జాతీయకరణ ఉద్దేశం ఇది కారాదు. లాభం అన్నది యావత్తు జాతి ప్రజలకు పంపిణీ కావాలి.


కమ్యూనిస్టు ప్రభుత్వం శాసన దండంతో ఈ లాభాన్ని ఒకరి నుండి లాక్కొని మరొకరికి ఇస్తుంది. దీనికి భిన్నంగా ఇస్లాంలో, మిగులు విలువ (Surplus Value)ను- దానికి అర్హులైన వారందరికీ పంచేందుకు ప్రేరేపింపజేయడం జరుగుతుంది. దాని గురించి ఉపదేశించబడింది కూడా. ఇస్లాంలో ఈ పంపిణీ వెనుక ప్రేరణ శక్తి ప్రభుత్వ ఒత్తిడి కాదు- విశ్వాస బలమై ఉంటుంది.

కమ్యూనిస్టు దేశాల్లో పరిశ్రమల్ని మాత్రమే జాతీయం చేయడం జరుగుతుంది. ఆదాయం పంపిణీ అయ్యేదేదో ఆ పరిశ్రమల్లోనే అవుతుంది. ఇక వ్యక్తుల ఆధీనంలోనున్న ఆస్తిపాస్తులపై వచ్చే లాభాల పంపిణీకి సంబంధించిన భావన లేనే లేదు. ఆచరణాత్మకంగా కూడా అలాంటి ఏర్పాటేదీ ఉన్నట్లు కానరాదు. కాని ఇస్లాం, వ్యక్తుల ఆదాయంలోని 'మిగులు విలువ'ను కూడా సమాజంలోని ఇతరులపై వెచ్చించాలని తాకీదు చేస్తోంది. మిగులు విలువలో నుండే ఒక భాగం తీసి సత్కార్యాలకై ఖర్చు చేయడాన్ని జకాత్ అనంటుంది ఇస్లాం. అరబీ భాషలో 'జకాత్' అంటే పరిశుద్ధపరచుట అని అర్థం. వ్యక్తులు తన ఆదాయంలోని ఒక భాగాన్ని ఇతరుల కోసం ఖర్చు చేయడమే జకాత్. అంటే జకాత్ ఇచ్చి మనిషి తన ధన సంపత్తిని పరిశుద్ధ పర్చుకుంటాడన్న మాట. అలా చేయకపోతే అతని యావత్తు ధనసంపద అశుద్ధమైపోతుంది. ఇంతటి ఉన్నతమైన బోధన, శిక్షణలు ప్రపంచంలో కేవలం ఇస్లాం మాత్రమే ఇచ్చింది. ధనంలో నుండి కొంత భాగం మంచి పనులకై ఖర్చు పెట్టే ప్రబోధనలైతే ఆ మతం యొక్క సిఫారసులు మాత్రమే కదా. ధనవంతుడైనా మోసగించదలిస్తే అతన్ని దాన్నుంచి వారించేదెలా? అని ఎవరైనా ఆక్షేపించవచ్చు.

అయితే ఈ ఆకేపణకు సమాధానం మనకు చరిత్రలో లభిస్తుంది. జకాత్ ఇవ్వడానికి నిరాకరించినవారికి వ్యతిరేకంగా ప్రథమ ఖలీఫా హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) కరవాలం చేబూనారు. నిజానికి నాడు జకాత్‌ను తిరస్కరించినవారు బాహ్యంలో ముస్లింలే. ఇస్లాం ధర్మావలంబీకులే. విశ్వాసులు, మహనీయ ముహమ్మద్ (స) అనుయాయులు, నమాజ్‌ను ఆచరించేవారయిన ముస్లింలకు వ్యతిరేకంగా ఈ కరవాలం ఝుళిపించబడింది. వారు ఏ నేరానికి (జకాత్‌ను ఎగ్గొట్టే) పాల్పడ్డారో అది అంత కఠినమైందన్న మాట. దైవాన్ని విశ్వసించిన తర్వాత ఇస్లాం ఒక వ్యక్తిపై విధిగా మోపే బాధ్యత, చాలా గట్టిగా తాకీదు చేసే విషయం- జకాత్. అంటే తన ఆదాయంలో నుండి ఒక నిర్ణీత భాగాన్ని తీసి తన తోటి బలహీన సోదరులకు సహాయం చేయడం అన్న మాట.

ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే, వ్యక్తి తన సొంత ఆదాయం మరియు సొంత పెట్టుబడిలో నుండి ఇతరుల కోసం ఖర్చు చేయమని కమ్యూనిజం బోధించదు. అయితే ఇస్లాం ఈ విషయమై గట్టిగా తాకీదు చేస్తుంది- ఇటువంటి ఖర్చు తప్పక చేయాలని కోరుతుంది. ఈ ఖర్చును ఎవరైనా చెయ్యకపోతే (అతడు ముస్లిం అయినప్పటికీ) ఇస్లాం అతనికి వ్యతిరేకంగా ధ్వజమెత్తుతుంది. అందుకే ఇస్లాం కమ్యూనిజంకంటే ఉన్నతమైనది, శ్రేష్ఠమయినది.

సాధారణంగా పెట్టుబడి పెట్టే ప్రతి వ్యక్తి తన ఈ ధనం తన సొంత సుఖభోగాలకని భావిస్తాడు. తన ఆదాయాన్ని ఇతరుల కోసం ఖర్చు చేయడం స్వయంగా లేమిని కొనితెచ్చుకోవడమేనని కూడా అతడు తలుస్తాడు. ఈ సంశయమే ప్రజల్ని సాధారణంగా సంకట పెడుతుంది.




ఇస్లాం అన్నింటికంటే ముందు ఈ భావనను వ్రేళ్ళతో సహా పెకలించి పారేస్తుంది. ఇతరులపై ఖర్చు చేయడం వల్ల సంపద తరగదు - పెరుగుతుంది అని ఖుర్ఆన్ చాటి చెబుతోంది.

"దారిద్ర్య ప్రమాదం చూపి షైతాన్ మిమ్మల్ని భయపెడతాడు. నీతిబాహ్యమైన, నీచమయిన మార్గం అవలంబించమని ప్రేరేపిస్తాడు. కాని మిమ్మల్ని క్షమిస్తానని, కరుణిస్తానని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. అల్లాహ్ అత్యంత ఉదార స్వభావుడు, అన్నీ తెలిసినవాడు". (బఖర - 268)

పిసినారితనం అంటే ఏమిటి? తన కోసం, తన భార్యాపిల్లల కోసం, తోటి సమాజంలోని వారి అవసరాల కోసం ఖర్చు చేయడానికి బదులు ఒక్కొక్క పైసాను కూడబెట్టడమే పిసినిగొట్టుతనం.

తమిళ సినీ పరిశ్రమలో ఒక ప్రసిద్ధ గాయకుడుండేవాడు. అతను అత్యంత పిసినారి. తన కొడుకు కాలికి గాయమైతే వైద్య చికిత్స చేయించడానికి కూడా అతను వెనుకంజ వేసేవాడు. పర్యవసానంగా అతని పుత్రుడు  చనిపోయాడు. ఇదీ పిసినారితనానికి ప్రతిఫలం! ఇలాంటి పిసినారితనాన్ని, సంకుచిత హృదయాన్ని ఇస్లాం గట్టిగా వ్యతిరేకిస్తుంది.

ఇస్లాం ఇతరులకై ఖర్చు చేసేందుకు కేవలం ఉపదేశాలు మాత్రమే ఇవ్వలేదు. దాంతోపాటు ఖర్చు చేయాల్సిన నియమాలను, పద్ధతులను కూడా అది నేర్పింది. కొంతమంది ఖర్చు చేస్తారుగాని ఇతరులను దెప్పి పొడవటం, ఉపకారం చేసి తమ ప్రతిష్టను పెంచుకోవటం వారి ఆశయమయి ఉంటుంది. ఇవి, ఇంకా ఇలాంటి ఇతర ఉద్దేశ్యాలు ధర్మబద్ధం కావని ఇస్లాం చెబుతుంది. దానం చెయ్యడం ధార్మికమైన విధి అని, ఇది నమాజు తర్వాత రెండో పెద్ద అంశం అని ఇస్లాం చెబుతుంది. తోటి వారికై ఖర్చు చేసి దైవ ప్రసన్నతను బడయటం తప్ప మరే ఉద్దేశ్యం దానధర్మాలకు ఉండరాదన్నది ఖుర్ఆన్ ఉపదేశం.

నేనొక చోట చూశాను - ఒకాయన ఓ సంస్థకు ట్యూబ్ లైట్‌ను విరాళంగా ఇస్తూ, దానిపై తన పేరును వ్రాయించారు. ఎంత ఘోరంగా వ్రాయించారంటే - ఆ లైటు వెలుగు అసలు బయటికి రాలేదు. ఇలాంటి దానధర్మం, ఇటువంటి సహాయం కేవలం తప్పు మాత్రమే కాదు. అది అతని సకల సత్కార్యాల ప్రతిఫలాలను నాశనం చేసివేస్తుందని ఇస్లాం హెచ్చరిస్తుంది. కొంత మంది ధన సహాయమో లేక వేరే ఏదయినా సహాయమో చేస్తారు కానీ తమ పెత్తనాన్ని సహాయం పొందిన వ్యక్తిపై రుద్దుతారు. తత్ఫలితంగా సహాయం పొందిన ఆ వ్యక్తి మనసు గాయపడుతుంది. ఈ పోకడలన్నీ అధర్మమయినవని ఇస్లాం ఉద్ఘాటిస్తుంది. దివ్య ఖుర్ఆన్‌లో ఉంది:
మనసును గాయపర్చే దానం కంటే, మృదుభాష్యం, క్షమాబుద్ధి ఎంతో మేలయినవి". (అల్ బఖర - 263)

వినోబాభావే భూదాన ఉద్యమం నడిపినప్పుడు కొందరు సారవంతమయిన భూముల్ని కూడా దానం చేసిన వారున్నారు. కాని చాలా మంది భూస్వాములు బంజరు భూములను, రాళ్ళు-రప్పలు నిండిన భూముల్నే దానం చేశారు.

తమ ఇంట్లోని చినిగిపోయిన దుస్తుల్ని, చద్ది అన్నాన్ని, విరిగిపోయిన,పగిలిపోయిన సామాన్లను ఇతరులకు దానం చేసే దాతలు కూడా కానవస్తారు. చినిగిపోయిన నోట్లను, చెల్లని నాణాలను దానం చేసే వారూ ప్రపంచంలో ఉన్నారు. కాని, ఇస్లాం మీ వద్ద ఉండే మంచి వస్తువుల్ని దానం చేయమని ప్రబోధిస్తోంది. దానం చెయ్యదలిస్తే - మీరు ఇష్టపడే దుస్తులు స్వయంగా మీరు తినే పదార్థాలు, మీకు ప్రియమైన సంపద - వీటన్నింటినీ అల్లాహ్ మార్గంలో ఖర్చు చెయ్యమని తాకీదు చేస్తోంది ఇస్లాం. మీరు సంపాయించేదాన్లో అన్నింటికంటే మంచి వస్తువులను దేవుని బాటలో ఖర్చుపెట్టాలి. ఇది ఇస్లాం ఉద్బోధన. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:
"విశ్వసించిన ప్రజలారా! మీరు సంపాయించిన ధనంలోని, మేము మీ కొరకు నేల నుండి ఉత్పత్తి చేసినదానిలోని మేలైన భాగాన్ని దైవ మార్గంలో ఇవ్వడానికి పనికిరాని వస్తువుల్ని ఏరి తీసే ప్రయత్నం చెయ్యకండి". (బఖర - 267)

మీరు ఇతరులకు చేసే అన్నదానమయినా, దుస్తులయినా లేక ధన సహాయమయినా - వీటిని రహస్యంగా ఇవ్వడం ఉత్తమ విధానమని ఇస్లాం ప్రకటిస్తోంది. అయితే బహిర్గత సహాయం చెయ్యాల్సిన అవసరం లేక స్థితి ఏర్పడితే అలా చెయ్యవచ్చు. దివ్య ఖుర్ఆన్ ఉపదేశమిది:

"మీరు మీ దానధర్మాలను బహిరంగంగా చేసినా మంచిదే. కాని రహస్యంగా నిరుపేదలకు దానమివ్వటం మీకు ఎక్కువ మేలు చేకూరుస్తుంది". (2: 271)

దానధర్మాల విషయంలో, ఎవరయినా ఒక త్రాగుబోతు లేక డబ్బును అనవసరంగా ఖర్చు పెట్టేవాడు మీ వద్దకు వచ్చి సహాయం అర్థించే పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు మీరేం చేస్తారు? ఒకవేళ అలాంటి వారికి సహాయం చేస్తే అదేమవుతుంది? ఈ ప్రశ్నలకు కూడా జవాబిచ్చింది ఇస్లాం. దుర్మార్గులకు, వ్యర్థప్రలాపనలకు పాల్పడేవారికి డబ్బు సహాయం ఇవ్వరాదన్నది ఇస్లాం ఉపదేశం. అయితే తిండి, దుస్తులు ఏర్పాటు చేయవచ్చు. దివ్య కుర్ఆన్‌లో ఇలా ఉంది:
"అల్లాహ్ మీ కొరకు ఏ సొమ్మునయితే జీవనాధారంగా చేశాడో, దాన్ని అవివేకులకు అప్పగించకండి. అయితే దాన్నుండి వారి అన్న వస్త్రాలకు ఇవ్వండి. ఇంకా వారికి హితబోధ చేయండి". (అన్ నిసా-5)

ఇలాంటివారి తిండి, బట్ట వంటి కనీసావసరాల ఏర్పాటు పూర్తయ్యాక, ఇక ఈ విషయంలో ఇస్లాం ఇచ్చే మార్గదర్శక సూత్రాలేమిటో చూడండి:



# నెలవంక ఉత్తరాలు

## ఆత్మ విశ్వాసముంటే....

ఆత్మ విశ్వాసం అనేది మనిషిని మనిషిగా తీర్చిదిద్దే ఒక యంత్రము. ఆత్మ విశ్వాసం అనేది మానవునికి ఆ దేవుడు అందించిన ఒక వరం. దీనిని పెంచడానికి ప్రతి మానవుడు తప్పక కృషి చేయాలి. ప్రతి వ్యక్తి ఆత్మ విశ్వాసంతో మెలిగినచో ధనం, గౌరవం, పేరు ప్రతిష్టలు వాటంతట అవే వస్తాయి. ఉదా; ఒక ఎడారిలో ఒక గొర్రెల మంద దగ్గర ఇద్దరు వ్యక్తులు పని చేస్తున్నారు. వాళ్ళకు సరిగ్గా తినడానికి తిండి లేదు. అప్పుడు అందులోని మొదటి వ్యక్తి "ఈ పని మనం చేయలేకపోతున్నాం" అని ఆత్మ విశ్వాసం కోల్పోయి వేరే పని చూసుకోవడానికి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. వేరే పని వెతుక్కుని ఆ పని చేయడం మొదలు పెట్టాడు. కొన్ని రోజులు చేసిన తర్వాత 'అది చేయలేకపోతున్నా' అని ఇంకొక పనిలోకి వెళ్ళాడు.అది చేయలేక ఇంకొక పని, ఇంకొక పనికి వెళ్ళిపోతూనే ఉన్నాడు. చివరికి ఏ పనీ చేయలేకపోయాడు. కాని రెండో వ్యక్తి ఎంత కష్టం అయినాసరే భరించి, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకుని, పట్టుదలతో కష్టపడి పని చేయడం మొదలుపెట్టాడు. అప్పుడు కొన్ని రోజుల తర్వాత ఆ యజమాని క్రమక్రమంగా – ఉండటానికి నివాసం, తినడానికి సరైన తిండి సమకూర్చాడు. అంతే కాకుండా తన కష్టానికి తగ్గ ప్రతిఫలాన్ని, ఆత్మ విశ్వాసంతో ఆనందాన్ని పొందగలిగాడు. ఈ ఉపమానాన్ని నెలవంక పుస్తకము ద్వారా మీకు తెలియజేయాలని అనుకున్నాను. 'నెలవంక' మాస పత్రిక మనిషి జీవితంలో కష్టాలను ఎలా ఎదుర్కొని ముందుకు సాగాలి, మనిషిని మనిషిగా తీర్చిదిద్దే విషయాలు తెలియజేస్తుంది. ఈ దేశంలో భాష వేరైనా తెలుగు వాళ్ళ కోసం తెలుగులో ప్రచురితమై అతి సులువుగా విషయాన్ని బోధ పరుస్తోంది. ఎడారిలో తిరిగే మనిషికి నీటి బిందువు దొరికితే ఎట్లా ఉంటుందో అలాగే నెలవంక పుస్తకం చదివిన ప్రతి మనిషికి ఆనందం కలుగుతుంది. నెలవంక పుస్తకం ప్రచురించేవారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

– సురేష్ (కబడ్)

## కమ్యూనిజం... మిగతా భాగం

1) మీ కోసం మీ భార్యాపిల్లల కోసం ఖర్చు చేయగా మిగిలిన సొమ్మును అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయండి.
2) మీ శక్తి స్థోమతలకు మించి ఖర్చు చేయకండి. అలా అని పిసినారులుగా కూడా వ్యవహరించకండి. మీ వైఖరి మధ్యే మార్గాన్ని అనుసరించేదిగా ఉండాలి.
3) దానధర్మాల విషయంలో మీ హస్తాన్ని మరీ అంత బిగించి ఉంచకండి. అలా అని మరీ అంత విచ్చలవిడిగా కూడా ఇచ్చేయకండి. అలా అతిగా దానం చేసేస్తే స్వయంగా మీరే ఇతరుల సహాయాన్ని కోరాల్సిన అగత్యం ఏర్పడవచ్చు.
4) మీ సమీప బంధువులు, నిరాధారులు, నిరుపేదలు, అనాథలు, బాటసారులు మీ సహాయం పొందడానికి అర్హులు.

తమ సొమ్ముపై జకాత్ చెల్లించడం ముస్లింల విధి. ఈ విధిని విస్మరించినవారికి కఠిన శిక్ష ఉంది. ఒకసారి మహాప్రవక్త ముహమ్మద్ (స) బంగారు గాజులు తొడిగిన ఒక స్త్రీని చూశారు. వీటికి జకాత్ చెల్లిస్తున్నావా? అని ఆయన (స) అడిగారు. 'లేదు' అన్నదా మహిళ. మహా ప్రవక్త (స) అన్నారు: "తీర్పు దినాన నీకు అగ్ని గాజులు తొడిగించబడతాయి." (అది విని ఆ మహిళ బంగారు గాజుల్ని దానం చేసేసింది).


జకాత్ పైకం ఎలాంటివారికి ఇవ్వాలి అన్న దాన్ని గూర్చి కూడా ఖుర్ఆన్ స్పష్టంగా ప్రకటించింది. బీదసాదలకు, నిరాధార జీవులకు, రుణ గ్రస్తులకు, అనాథలు మరియు బాటసారులకు సహాయం చేయడంతోపాటు మంచి వైపుకు ముందంజ వేసేవారిని ప్రోత్సహించడానికి, బానిసలకు విముక్తిని కలిగించడానికి కూడా జకాత్ ధనాన్ని ఉపయోగించవచ్చు. అదీగాక, జకాత్ ధనాన్ని వసూలు చేసే కార్యంలో నిమగ్నమై ఉన్నవారికి కూడా ఆ మొత్తంలో నుండి భృతిని ఇవ్వవచ్చు. జకాత్ ఖర్చుచేసే పద్దుల్లో దైవ మార్గం అన్న పద్దు కూడా ఉంది. 'దైవ మార్గంలో ఖర్చు' అనేది భావపరంగా చాలా విస్తృతమైన అర్థాన్ని ఇస్తుంది. సత్కార్యాలన్నీ 'దైవమార్గం' పద్దులోకే వస్తాయి. ముఖ్యంగా ధర్మ ప్రచారం, ధర్మోన్నతికై జరిపే కార్యకలాపాలు 'దైవమార్గం'లోకే వస్తాయి.

తల్లిదండ్రులు, సంతానం మొదలుగువారు ఒక వ్యక్తి పోషణలో ఉన్నప్పుడు అతనిచే జకాత్ ధనానికి వారు అర్హులు కాజాలరు. జకాత్ ధనమైతే ఇతరుల కోసమే కేటాయించబడుతుంది.

సాధ్యమైనంత వరకు అడగటం లేక యాచించటం నుండి తమను కాపాడుకోండి అనేది ఇస్లాం ప్రబోధనల్లో మరో అంశం. మనిషి వీలయినంతవరకు ఇవ్వడానికి,ఇప్పించడానికి ప్రయత్నించాలిగాని పుచ్చుకోవడానికి కాదు. ఒకరి ముందు దేహి అంటు చేయి చాచడం కంటే కట్టెలు కొట్టి ఆ డబ్బుతో గడపటం ఎంతో ఉత్తమం అని మహా ప్రవక్త (స) ప్రవచించారు.

ఒకసారి మహా ప్రవక్త (స) ఓ పల్లెటూరి వ్యక్తిని దగ్గరకు పిలిచి అతని చేతుల్ని ముద్దు పెట్టుకున్నారు. అతని చేతులు కాయలు కాసాయి. అతను బ్రతుకు తెరువు కోసం కూలి పని చేసేవాడు.కనుక మహనీయ ముహమ్మద్ (స) సంతోషంతో అతని అర చేతుల్ని ముద్దాడారు.

ఒకవైపు, యాచించటాన్ని అరికడితే మరోవైపు, మనస్ఫూర్తిగా ఇతరులకు సహాయం చెయ్యమని ఆజ్ఞాపిస్తుంది. దీన్ని బట్టి ఇస్లాం ప్రబోధనల్లో ఎంతో గొప్ప సమతూలనం ఉన్నట్లు మనకు తెలుస్తోంది.




('నేను ఆరాధించే ఇస్లాం' పుస్తకం నుండి)



# వివేచన

## మహనీయ ముహమ్మద్

(సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు:

"సకాలంలో గమ్యం చేరుకోలేనని, మార్గ మధ్యంలోనే ఉండిపోతానన్న భయమున్న ప్రయాణీకుడు రాత్రి నిద్రపోడు. పైగా రాత్రి పెందలాడే ప్రయాణం చేస్తాడు. ఇలా చేసేవాడు సమయానికి గమ్యం చేరుకుంటాడు. వినండి! దేవుని సరకు కోసం భారీ మూల్యం చెల్లించాలి. తెలుసా! దేవుని సరకు స్వర్గం". (తిర్మిజీ – అబూ హురైరా (రజి))

ఓ మిత్రమా!

నిజానికి నీవు ఒక బాటసారివి. ప్రయాణ సన్నాహాలు చేసుకో. 'అమ్ముడుపోయే సరకు'గా మారకు. నిన్ను స్వర్గానికి చేర్చే రాచబాటను ఎన్నుకో. పరధ్యానంలో పడిపోతే మిగిలేది పరాభవమే!




## మండే ఎడారిలో చల్లని వెన్నెల నెలవంక
## గల్ఫ్‌లో నెలనెలా వెన్నెలను కాచే ఆధ్యాత్మిక మాసపత్రిక

# నెలవంక

| | Description | Advertisement Rate | 30% Discount for One year | 20% Discount for one Month |
|---|---|---|---|---|
| 1 | Inside Page of Front Cover | KWD 150 | KWD 105 | KWD 120 |
| 2 | Inside Page of Back Cover | KWD 150 | KWD 105 | KWD 120 |
| 3 | Single Page Inside | KWD 100 | KWD 70 | KWD 80 |
| 4 | Two middle pages | KWD 200 | KWD 140 | KWD 160 |
| 5 | Back Cover Page | KWD 200 | KWD 140 | KWD 160 |

Half Page : Half of the above mentioned rates
Quarter Page : Quarter of the above mentioned rates

contact:
email:mujq8@yahoo.co.in, Tel.No: 2444117 ext.110, 66104547
4711141 ext.104, 66357548